# శౌర్యానికి ప్రతిరూపం ఛత్రపతి శివాజీ మహారాజ్

● జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను



**విజయవాడ,జూన్ 9 (వార్తాప్రభ) :** అఖండ భారత సామ్రాజ్యమే లక్ష్యంగా మొఘల్ చక్రవర్తులను ఎదిరించి పోరాడిన మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ శౌర్యానికి ప్రతిరూపమని సామినేని ఉదయ భాను అన్నారు. జగ్గయ్యపేట విజయవాడ రోడ్డులో సోమవారం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్, కే. డి. సి. సి. బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ తో జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేటలో ఛత్రపతి విగ్రహ ఏర్పాటు శుభపరిణామమని, దీని కోసం కృషి చేసిన విగ్రహ కమిటీ వారికి ప్రత్యేక అభినందన తెలిపారు. మాతృభూమిపై శివాజీకున్న మక్కువ, ఆయనలోని దేశభక్తి, శత్రువు ఎంతటి బలవంతులనైన ఎదిరించి పోరాడే ఆత్మ స్థైర్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జీవితన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో కుటమి నాయకులు, జనసేన పార్టీ శ్రేణులు, హిందూ చైతన్య వేదిక సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మండల వైసీపీ ప్రధాన కార్యదర్శిగా లోయ ఆంజనేయులు



**పెడన,జూన్ 9 (వార్తాప్రభ) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెడన మండలంలో పదవులు పరంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్షాళన రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుంది. ఇందులో భాగంగానే మార్పులు చేర్పులు జరిపారు. ప్రధాన కార్యదర్శిగా లోయ ఆంజనేయులు నియమితుల య్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం వెలువడింది. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఉప్పాల రాము సూచన మేరకు ఈ నియామకం జరిగింది. కొంగంచర్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు తల్లి సర్పంచిగా పనిచేశారు. అలాగే ప్రస్తుతం ఆయన భార్య సర్పంచ్ గా వ్యవహరిస్తున్నారు. క్రియాశీలకంగా పనిచేసే ఆంజనేయులుకు పార్టీ పరంగా ప్రమోషన్ లభించింది. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పెద్దలకు పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్రమంత్రికి లేఖాస్త్రాలు..



**కాకినాడ,జూన్ 9 (వార్తాప్రభ) :** భారతీయ తపాలా విశ్రాంత ఉద్యో గులు కేంద్ర మంత్రికి లేఖాస్త్రాలు సంధించారు. ఆల్ ఇండియా పోస్టల్ & ఆర్ఎమ్ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ కేంద్ర కమిటీ పిలుపు మే రకుఎస్ 3వ విడతలో భాగముగా 113 పెన్షనర్లు కేంద్ర మంత్రి జ్యోతి రాదిత్యకి డిమాండ్స్ సాధన కోసం 5రూపాయల కవర్ లో ఎవరికీ వారు డైరెక్ట్ పోస్ట్ చేశారు. అల్ ఇండియా పోస్టల్ & ఆర్.ఏం. ఎస్. పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ డివిజన్ తరపున ప్రెసిడెంట్ జి.వి లక్ష్మీ నారాయణ, కార్యదర్శి తురగా సూర్యారావు, ఫైనాన్స్ కార్యదర్శి సిహెచ్ రామారావు కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఉన్న పోస్టల్ డబ్బాలో వేసినారు, ఈకార్య క్రమంలో అసోసియేషన్ తరపున ప్రెసిడెంట్.జివి. లక్ష్మీనారాయణ కార్యదర్శి.తురగా సూర్యారావు ఫైనాన్స్ కార్యదర్శి సిహెచ్ రామారావు నాయకత్వం వహించారు.

# 18 యూనిట్లకు 454 రూపాయలా?



**విస్సన్నపేట,జూన్ 9 (వార్తాప్రభ) :** నాడు ఎన్నికల ముందు కూటమి పార్టీల నేతలు విద్యుత్ బిల్లులు పెంచేది లేదని పలు బహిరంగ సభల వేదికలపై హామీ ఇవ్వడం సర్వత్రా తెలిసిందే. 606 సర్వే నంబర్ కు మే నెల 25 జూన్ నెల 25 మధ్య కాలానికి 7267-7249=18 యూ నిట్లకు454 బిల్లు రావడం సంబర మాశ్చర్యాలను గురి చేయటం జరిగి ంది. సంబంధిత బిల్లులో ఎనర్జీ చార్జి 34.20 పైసలు, ఫిక్స్ చార్జెస్ 20 రూపాయలు, కస్టమర్ చార్జెస్ 25 రూపాయలు, విద్యుత్ సుంకం 1.8 పైసలు , ఇంట్రెస్ట్ ఆన్ ఈడి నాలుగు పైసలు, ట్రూ/ అప్ 35/ 36 57-52 పైసలు, ఎఫ్ పి పి జి ఎ చార్జెస్(10/22) 190.90,(06/23) 85.45,(04/25)40.00 రూపాయలు, లాభనష్టాలు 0.19 పైసలు వెరాస బిల్ అమౌంట్ 454 రూపాయలు రావటం సస్పెన్స్ యాక్షన్ కిల్లర్ విచ్ కాక్ మూవీస్ ను రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు తలపిస్తున్నాయని ఇదేమి మాయాజాలమో అని పలుచోట్ల వినిపిస్తుంది

# శ్రద్ధాంజలి ఘటించిన డాక్టర్ నాగేశ్వరరావు



**తిరువూరు,జూన్ 9 (వార్తాప్రభ) :** పట్టణం చెందిన ప్రముఖ లారీ ఆఫీస్ ఓనర్ స్వర్గం నాగేశ్వరరావు కుమారుడు స్వర్గం శరత్ ఖమ్మం జిల్లా జరిగిన రోడ్డు ప్రమాదంలో శరత్ మరణించగా వారి స్వగృహంలో శరత్ మృతదేహాన్ని సందర్శించు నివాళులర్పించిన జయకృష్ణ హాస్పటల్ అధినేత ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారు ఎండి జనరల్ ఫిజీషియన్

# పర్యావరణ పరిరక్షణ దినోత్సవం లో అలరించిన "యాంకర్" రాజబాబు మాట.. పాట







**కాకినాడ,జూన్ 9 (వార్తాప్రభ) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యకళా మందిరం,కాకినాడలో జరిగిన కార్యక్రమంలో "పర్యావరణ పరిరక్షణ"లో వృక్షాల ప్రాముఖ్యత,ప్లాస్టిక్ వాడక నివారణ"లపై అవగాహన కలిగించే విధంగా, స్వీయ రచనలో "యాంకర్" రాజబాబు గానాలాపన చేస్తున్నప్పుడు ,ఆద్యంతం సభికులను అలరించి, ఆకట్టుకుంది.అలాగే కాకినాడ పురవీధుల్లో వందలాది మందితో జరిగిన బారీ ర్యాలీ లో రాజబాబు చే పర్యావరణ పరిరక్షణపై రికార్డ్ చేయబడిన మాట,పాటలను చైతన్య రథంలో ఊరేగింపుగా ప్రజల్లో అవగాహన కలిగించడం జరిగింది. ఆ తర్వాత జరిగిన నగర ప్రజల నుండి ఆకాశవాణి గాయకులు, వ్యాఖ్యాత, రచయిత అయిన రాజబాబుకు ప్రేక్షకులనుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ జె.సి శ్రీ రాహుల్ మీనా, సమాచార డి.డి నాగార్జున, డి.ఆర్.ఓ శ్రీ వెంకటరావు, ఏం.ఎల్.ఏ, ఏం.ఎల్.సి.తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# నేషనల్ ఫుట్ బాల్ గేమ్స్ లో రాణిస్తున్న తాడిబోయిన శ్రీలక్ష్మి







**పెదకాకాని, జూన్ 9 (వార్తాప్రభ) :** గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, ఉప్పలపాడు గ్రామం కు చెందిన తాడిబోయిన శ్రీలక్ష్మి ఫుట్ బాల్ గేమ్స్ లో అంచలంచెలుగా ఎదుగుతూ నేషనల్ గేమ్స్ స్థాయికి చేరుకున్నారు. ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్లో 8వ తరగతి నుండి ఫుట్ బాల్ లో ప్రాక్టీస్ చేస్తూ, తొమ్మిదో తరగతిలో ఫస్ట్ టైం నేషనల్ ఆడటం జరిగింది. ఇప్పటివరకు మండల, జిల్లా స్థాయిలలో ఆరు సార్లు, రాష్ట్రస్థాయిలో ఐదు ఆడటం జరిగింది. మూడోసారి ఫుట్ బాల్ నేషనల్ కి సెలెక్ట్ అయ్యి చత్తీస్గడ్ బిలాస్ పూర్ లో వారం రోజులు ట్రైనింగు కోర్బాలో నేషనల్ ఉమెన్స్ ఫుట్ బాల్ గేమ్స్ లో పాల్గొన్నారు. ఫుట్ బాల్ రంగంలో ఎదుగుతున్న తాడిబోయిన శ్రీలక్ష్మి చదువులోనూ మెరిట్ గా కొనసాగుతున్నారు ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్లో స్కూల్ ఫస్ట్ రావటం జరిగింది, మొదటిసారిగా బీహార్ లో జరిగిన నేషనల్ ఫుట్ బాల్ గేమ్ లో పాల్గొనడం జరిగింది. రెండవసారి అనంతపురంలో నేషనల్ ఫుట్ బాల్ గేమ్స్ లో పాల్గొనడం జరిగింది. ఇప్పుడు మూడోసారి చత్తీస్గడ్ కోర్బాలో మూడోసారి నేషనల్ ఉమెన్స్ ఫుట్బాల్ గేమ్స్ లో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి కి ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలపడం జరిగింది. జాతీయ ఫుట్ బాల్ క్రీడల్లో పాల్గొన్న తనకు భవిష్యత్తులో నేషనల్ ఫుట్ బాల్ టీంలో సెలెక్ట్ అయి దేశానికి, రాష్ట్రానికి, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావడమే తన లక్ష్యంగా తాడిబోయిన శ్రీలక్ష్మి చెప్పటం "వార్తా ప్రభ "కు చెప్పటం జరిగింది. ఫుట్ బాల్ గేమ్ కు బ్రహ్మం కోచ్, గుంటూరు సాయి కోచ్, వైజాగ్ వారి ప్రోత్సాహంతో ఈ నేషనల్ గేమ్ ఆడటం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఇండియన్ టీం లో జాయిన్ అవుతానని ఆ లక్ష్యంతోనే నేషనల్ గేమ్స్ ఆడుతున్నారని శ్రీలక్ష్మి పేర్కొంది. అతి త్వరలోనే ప్రముఖ స్టార్ క్రికెటర్ "ధోని" నీ తాడిబోయిన శ్రీలక్ష్మి కలవనుంది. ఈ మేరకు అపాయింట్మెంట్ కూడా వచ్చినట్లు శ్రీ లక్ష్మి తండ్రి, రచయిత తాడిబోయిన తాతారావు "వార్తా ప్రభ" కు తెలిపారు.

# ఆరోగ్య జీవన విధానానికి యోగా ఉపయోగకరం

● అవగాహన ర్యాలీ ప్రారంభించిన కలెక్టరు మహేష్ కుమార్




**అమలాపురం,జూన్ 9 (వార్తాప్రభ) :** ఆరోగ్యకర జీవన విధానానికి యోగ దోహదపడుతుందని జిల్లా కలెక్టరు ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈనెల 21వ తేదీ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో స్థానిక కలెక్టరేట్ నుండి నల్ల వంతెన వరకు నిర్వహించిన యోగాపై అవగాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టరు ఆర్.మహేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు వయస్సుతో సంబంధం లేకుండా జీవన శైలిలో భాగంగా రోజువారీగా యోగాస నాలు ఆచరించి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొంది ఆరోగ్యకర సమాజ స్థాపన దిశగా పయనించాలని సూ చించారు. రాష్ట్ర ప్రభుత్వం భారతీయ వారసత్వ సంపద యోగాను ప్రతి ఒక్కరూ ఆచరించేందుకు మాసోత్స వాలను నిర్వహిస్తోందని,ఈ యొక్క అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని యోగ అభ్యసన ద్వారా మెరుగైన జీవనాన్ని గడపాలని సూచించారు. ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ యోగా చరణతో దేహ దారుఢ్యంతో పాటుగా మానసిక ఆరోగ్యం సొంతమవు తుందన్నారు. ప్రజలకు యోగాను చేరు చేసేందుకే యోగాంధ్ర కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. యోగాపై విస్తృత అవగాహన పెంపొందించి ప్రజల్లోనికి తీసుకువెళ్లాలన్నారు. ప్రజలు కూడా తమ జీవన శైలిలో యోగాను భాగంగా చేసుకుని జీవితాంతం అభ్యసిస్తూ మెరుగైన జీవనాన్ని గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల తహశీల్దారు అశోక్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాబ్జి రాజు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆయుష్, వైద్య బ్రహ్మ కుమారిస్, ఓం శాంతి మహిళలు పెద్ద ఎత్తున యోగాపై అవగాహన ర్యాలీలో పాల్గొని నినాదాలతో పుర జనులకు అవగాహన కల్పించారు.

# కేఎస్ఆర్ , కృష్ణంరాజులపై ఎస్సీ ఎస్టీ యాక్ట్ నమోదు చేయండి

● తక్షణమే అరెస్టు చేయండి ● అమరావతిని వేశ్య రాజధాని అనడం గర్హనీయం ● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ కు ఫిర్యాదు ● టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్



**అమరావతి,జూన్ 9 (వార్తాప్రభ) :** సాక్షి మీడియా ఛానల్ లో జరిగిన డిబేట్ లో అమరావతిని వేశ్య రాజధాని అన్న విశ్లేషకుడు కృష్ణంరాజు , జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు లు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మంగళగిరి లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కు అమరావతి రాజధాని రైతులతో కలసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ఫిర్యాదు చేయడం జరిగింది. అలాగే సాక్షి మీడియా ఛానల్ యాజమాన్యం పై కూడా క్రిమినల్ చర్యలు చేపట్టాలని చర్యలు తీసుకోవాలి . వారి ఇద్దరిపై ఎస్సీ ఎస్టి అట్రాసిటీ యాక్ట్ చట్టం కింద కూడా కేసులు నమోదు చేయాలని మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ ను కోరినట్టు పాతర్ల రమేష్ విలేకరులకు తెలిపారు. అమరావతి రాజధాని లో ఉన్న మహిళలు పై చేసిన వ్యాఖ్యలపై వారిపైన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మంగళగిరి ప్రాంతంలో తాడికొండ అమరావతి రాజధాని ప్రాంతంలో అంతా 65 శాతం దళిత రైతులు మరియు దళితులు, ఎస్టీలు , బీసీలు మరియు మైనార్టీలు , బలహీనవర్గాలు అత్యధికంగా ఉన్నారు. సాక్షి లైవ్ డిబేట్లో వేసెల్ అంటూ సంబోధించిన ఎనలిస్టు కృష్ణంరాజు కొమ్మినేని శ్రీనివాసరావు సాక్షి మీడియా మీడియా ఛానల్ యాజమాన్యం లపై ఎస్సీ ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేయాలని ఆయన చైర్పర్సన్ కోరారు ఈ ఛానల్లో వారన్న మాటలు దళితుల మరియు బడుగు బలహీన వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని పాతర్ల అన్నారు వెంటనే కృష్ణంరాజు కొమ్మినేని శ్రీనివాసరావు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టును నమోదు చేసి, వారిని అరెస్ట్ చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ డాక్టర్ రాయపాటి శైలజ ను కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని పాతర్ల రమేష్ తెలిపారు. మహిళ కమిషన్ చైర్పర్సన్ ను కలిసిన వారిలో రమేష్ తో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, తెలుగుదేశం పార్టీ జిల్లా రైతు నాయకులు కల్లం రాజశేఖర్ రెడ్డి, హైకోర్టు న్యాయవాదులు మేడూరి వరప్రసాద్, మంగళగిరి లీగల్ సెల్ నాయకులు వడ్డేశ్వరం ప్రసాద్ రావు, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొక్క నాగరాజు, సీనియర్ జర్నలిస్ట్ ఉప్పు వీరాంజనేయులు, అమరావతి జేఏసీ నాయకులు, మహిళ నాయకురాళ్ళు తదితరులు ఉన్నారు

# రాష్ట్ర ప్రాక్టీస్ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా రాయపూడి వేణుగోపాల్ రావు నియమకం.




**అవనిగడ్డ,జూన్ 9 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రాక్టీస్ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన సీనియర్ న్యాయవాది రాయపూడి వేణుగోపాల్ రావు నియామకం అయ్యారు. బెజవాడ బార్ అసోసియేషన్ హాల్లో రాష్ట్ర ప్రాక్టీస్ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీగా రాయపూడి వేణుగోపాల్ రావును సమావేశం ఎంపిక చేసి ఆమేరకు నియామకం చేశారు. ఈ సందర్భంగా రాయపూడి వేణుగోపాల్ రావు స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ప్రాక్టీస్ అడ్వకేట్ సొసైటీ ఆశయాలను న్యాయవాదులందరికీ చేరే విధంగా చేసి సొసైటీ బలోపేతానికి కృషిదేవి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయిలో జాయింట్ సెక్రటరీ గా ఎన్నుకున్నందుకు సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు గౌరీ మణి ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి రంగారావు , సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాక్టీస్ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ వేదికగా న్యాయవాదులందరికి వెల్ఫేర్ విషయంలో అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ నూతనంగా ఏర్పడిన సొసైటీ విధివిధానాలను , ఆశయాలను త్వరలోనే రాష్ట్రంలోని న్యాయవాద లందరికీ తెలియజేయడం జరుగుతుందని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాయపూడి వేణుగోపాల్ రావు వివరించారు. ఈ సందర్భంగా రాయపూడి వేణుగోపాల్ రావు ను సొసైటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

# కాలువల మరవత్తు పనులు సత్వరమే పూర్తి చేయాలి : యార్లగడ్డ



**గన్నవరం,జూన్ 9 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గంలో చేపట్టిన కాలవల మరమత్తు పనులను సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు అధికారులు ఆదేశించారు. సోమవారం ఉదయం గన్నవరం మండలం బుధవారం గ్రామ సమీపంలోని ఏలూరు కాలువ, ఉంగటూరు బ్రాంచ్ కెనాల్ మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును నీటి సంఘాల అధ్యక్షులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా కాలవల్లో పూడిక తీత, మరమ్మతు పనులు పూర్తి కాక పోవటంతో పంట కాలువలకు సాగునీరు విడుదల చేయలేదన్నారు. కాలువల పనులు వేగవంతంగా పూర్తి చేసి సాగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని, నీటి సంఘాలు అధ్యక్షులు, డిసి చైర్మన్లు మరమ్మతు పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని యార్లగడ్డ సూచించారు.

# అమరావతిపై దుష్ప్రచారం చేయాలని మహిళలని చులకన చేస్తున్నారు

- ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్



**విజయవాడ,జూన్ 9 (వార్తాప్రభ) :** జర్నలిస్టులు, ఎనలిసిస్టుల పేరుతో అమరావతి రాజధాని మహిళలపై కించపరిచే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట నుండి సాక్షి మీడియాకు అమరావతి రాజధాని ఉద్యమం నడిపిన మహిళలు అంటే చులకన భావం ఉందని ఆరోపించారు. జర్నలిస్టులు విలువలు పాటించాలని, ఇటువంటి కించపరిచే వ్యాఖ్యలు పునరావృతం కాకూడదన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, పోలీసులకు ఈ ఘటనపై ఫిర్యాదు చేశారని జర్నలిస్టుల ముసుగులో ఉన్న కొమ్మినేని శ్రీనివాసరావు తో పాటు, కృష్ణంరాజును కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కూడా సుమోటోగా కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ అన్నారు.

# పెడన మండల వైసీపీ ఉపాధ్యక్షునిగా గుడిసేవ శ్రీనివాసరావు



**పెడన,జూన్ 9 (వార్తాప్రభ) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెడన మండలంలో పదవులు పరంగా మార్పులు చేర్పులకు శ్రీకారం చుట్టారు. ఈ మార్పులు చేర్పులు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మార్పులు చేర్పులు జరిపారు. ఉపాధ్యక్షునిగా గుడిసేవ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం వెలువడింది. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఉప్పాల రాము సూచన మేరకు ఈ నియామకం జరిగింది. ఈయన తండ్రి గుడిసేవ కృష్ణమూర్తి నుంచి కూడా వీరిది కాంగ్రెస్ కుటుంబం. వైసిపి ఆవిర్భావం నుంచి ఈ పార్టీలో కొనసాగుతున్నారు. కమలాపురం పంచాయతీ ఉప్పలకలవగుంట గ్రామానికి చెందిన అయన ప్రస్తుతం గ్రామ సర్పంచ్ గా వ్యవహరిస్తున్నారు. క్రియాశీలకంగా పనిచేసే శ్రీనివాస్ కు పార్టీ పరంగా ప్రమోషన్ లభించింది. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పెద్దలకు పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ లే అవుట్ దారులందరికి నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదు

● వేణు నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు ● ప్రశ్నించిన టిడిపి నాయకులు



**పెడన,జూన్ 9 (వార్తాప్రభ) :** పెడన పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో పూర్తిగా విఫలమైన ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం అధికారుల మీద ఆరోపణలు చేస్తూ మీ చేతకానితన్నని మరోసారి నిరూపించుకున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. సోమవారం నాడు పట్టణ టిడిపి నాయకులు స్థానిక పాత్రికేయులతో మాట్లాడారు. పురపాలక సంఘం లో 43 మంది అక్రమ లేఅవుట్ దారులను ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన మీరు ఇప్పటివరకు ఎంత మందికి నోటీసులు అందజేశారని ప్రశ్నించారు అక్రమ లేఅవుట్ దారులు డబ్బును పురపాలక సంఘంకి కడతామని కటకం ప్రసాద్ తెలియజేయడంలో అర్థం ఏమిటి అని ప్రశ్నించారు. కేవలం 14 మందికి మాత్రమే నోటీసులు అందజేసిన మీరు మిగతా వారికి ఎందుకు అందజేయలేదని,అలాగే డబ్బులు జమ చేస్తాము అని మీకు కబురు చేస్తే ఇంతవరకు వారితో ఎందుకు పురపాలక సంఘం నికి జమ చేయించలేదని అన్నారు. అధికారాలతో నిత్యం అంటకాగుతూ మీ చేతకానితనాన్నీ అధికారుల మీద వేయడం ఎంత వరకు సమంజసం అని వారు ప్రశ్నించారు గత 7 సంవత్సరాల వైసిపి పాలనలో మగ్గుతున్న పురపాలక సంఘంలో అభివృద్ధి కార్యక్రమాల మీద ఏనాడైనా సమీక్షించారా అని ప్రశ్నించారు నిత్యం వేణుగోపాలరావు మీద ఆరోపణలు చేస్తూ మీ సొంత పనులను,పబ్బం గడుపుకుంటున్న తీరును మేము ఖండిస్తున్నాం మీ కౌన్సిలర్ గూడూరు రోడ్ ఆక్రమించుకుని భవనాన్ని నిర్మించి అమ్ముకున్న విషయం మీకు తెలియదా అని అన్నారు ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య కమ్మగంటి వెంకటేశ్వరావు యర్రా రాజా యక్కల బసవ పాల్గొన్నారు

# ఎడిటోరియల్

## వారి వల్లే కూటమికి ఇబ్బందులా ?

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తి అవుతోంది. అయితే ప్రభుత్వం పట్ల కనిపిస్తున్న ఆదరణ కంటే దానిని మించి ఎమ్మెల్యేల పనితీరే జనాలలో వ్యతిరేకతను తెస్తోందని సర్వేలు అనేకం చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చామన్న ఆలోచనతో కొందరు చేస్తున్న తప్పులు మొత్తం కూటమికి చుట్టుకుంటున్నాయని అంటున్నారు.వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోరాదు అని చంద్రబాబు పదే పదే క్లాస్ తీసుకుంటున్నా కొందరి వైఖరిలో మార్పు రావడం లేదని అంటున్నారు. వారు అధికారాన్ని ఆ మజాని తొలిసారి చూస్తున్నారు. దాంతో దూకుడు చేస్తున్నారు. దీని వల్లనే కూటమికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు.ఇక చూస్తే కూటమిలో మొత్తం 164 మంది గెలిస్తే అందులో ఈసారి ఏకంగా 88 మంది ఎమ్మెల్యేలు తొలిసారి గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. దాంతో ఈ కొత్త ఎమ్మెల్యేలలో చాలా మంది వైఖరి వల్లనే కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని అంటున్నారు. తమ ప్రాంతాలలో ఇసుక దందాలు అలాగే ఇతరత్రా అవినీతి విషయంలో వీరి ప్రోత్సాహం ఎక్కువగా ఉందని ప్రచారం అయితే సాగుతోంది.ఇక వైసీపీ హయాంలో చాలా మంది ఇలాగే చేస్తే జనాలు మొత్తం ప్రభుత్వం మీద కోపం తెచ్చుకుని దించేశారు. ఫలితం దారుణంగా వచ్చింది. అది చూసి కూడా కొత్త ఎమ్మెల్యేలు కొందరు గుణపాఠాలు నేర్చుకోకపోగా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న ఆలోచనతో ముందుకు సాగుతున్నారని అంటున్నారు.మరోసారి టికెట్ సుదీర్ఘమైన పొలిటికల్ కెరీర్ అన్నది కొందరికి బొత్తిగా పడని మాటలుగా ఉన్నాయని అంటున్నారు. చాన్స్ ఇపుడే ఉంది. దాంతో ఏమైనా చేసేయాల్సిందే అని వారు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఇక కూటమి ప్రభుత్వంలో అసలే పథకాలు అందక జనాలు కాక మీద ఉన్నారు. అలాంటి వారికి ఈ తరహా దూకుడుతో ఉన్న కొందరు ఎమ్మెల్యేల తీరు చూస్తే కనుక మరింత ఆగ్రహం కలుగుతోంది అని అంటున్నారు. చాలా మందికి పవర్ బుర్రలోకి ఎక్కేసింది అని అంటున్నారు. దాంతో రియల్ ఎస్టేట్ దందాలకు దిగుతున్నారు. మద్యం షాపుల వేలం పాటలలో తల దూర్చి మరీ తమ ఆధిపత్యం చాటుకుంటున్నారు. ఇక బెల్ట్ షాపులకు కొందరు సహకరిస్తున్నారు. బార్లా బార్లు తెరచి మరీ జనాలకు ఇబ్బంది కలిగించేలా చర్యలు చేయడం వల్లనే వారికి మాత్రమే కాకుండా యావత్తు ప్రభుత్వానికే చెడ్డ పేరు వస్తోంది అని అంటున్నారు.ఇవి చాలదన్నట్లుగా కూటమిలో ఉన్న మూడు పార్టీల మధ్య వర్గ పోరు సాగుతోంది. అలాగే ఆధిపత్యం కూడా చాలా చోట్ల ఉంది. దాంతోనే జనాలు విసిగిపోతున్నారు అని అంటున్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న కూటమి పెద్దలు సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు కొన్ని సార్లు వార్నింగ్ ఇస్తున్నారు. అయితే ఫలితం ఉంటుందా అన్నదే చర్చగా ఉంది. ఎందుకంటే ఈ కాలంలో రాజకీయం అలా అయిపోయింది అని అంటున్నారు

## కాటమరాజు క్లబ్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ పంపిణీ



**విశాఖపట్నం, జూన్ 9** (వార్తాప్రభ ప్రతినిధి)కాటమ రాజా క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు శివాజీ పాలెం, విశాఖపట్నం లో వున్న సవేరా ఫంక్షన్ హాల్లో 10 వ మరియు ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన యాదవ విద్యార్థిని, విద్యార్థులకు క్యాష్ అవార్డు మరియు కెరీర్ గైడెన్స్ బుక్స్ మరియు మెరిట్ సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో సుమారు 100 మంది స్టూడెంట్స్, మరియు పేరెంట్స్ పాల్గొన్నారు. కాటంరాజు క్లబ్ అధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ కోన జగదేశ్వర రావు యాదవ్ ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. క్లబ్ సెక్రటరీ రాజన బంగారు రాజు యాదవ్,ట్రెజరర్ బొట్ట రవిచంద్ర యాదవ్, వైస్ ప్రెసిడెంట్స్ ఎల్.వి.రమణ,ఎస్. హరినాథ్, జాయింట్ సెక్రెటరీ పి.వి.కిషోర్ యాదవ్, మన్యాల సంజీవరావు,కార్య వర్గ సభ్యులు కాయిత శ్రీనివాసరావు, బొట్ట సూర్య ప్రకాశ రావు, ఎన్. లోకేష్, కె. కృష్ణ మోహన్,కిల్లనా శ్రీనివాస్ మరియు ముఖ్య సలహా దారులు డా గుంటుబోయిన సత్యనారాయణ మూర్తి,బి.వి. నాగభూషన్ రావు, సభ్యులు ఇసరపు చంద్రశేఖర్, ఎస్. సాయి శ్రీధర్ పాల్గొన్నారు.కెరీర్ గైడెన్స్ మీద డా. ఎస్. హరినాధ్ మాట్లాడగా, స్టూడెంట్స్ కు హెల్త్ టిప్స్ డా.జి.ఎస్. ఎన్. మూర్తి అందించారు.. ఎబ్రాడ్ స్టడీస్ గురించి శీరం రవి మాట్లాడగా, క్లబ్ కోశాధికారి బొట్ట రవిచంద్ర వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది. సమావేశంలో యాదవ విద్యార్థిని, విద్యార్థులు క్రమ శిక్షణయుతమైన ఆలోచనతో, గొప్ప లక్ష్యాన్ని ఏర్పరచుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని నిర్వాహకులు అభిలాష వ్యక్తం చేశారు.

# ఇలా చేస్తే చాలు

ఆత్మీయత పంచితే
ఆదర్శం చూపితే
అవనిలోన అదృష్టం
ఆనందం పొందితే
సంస్కారం చాటితే
సమ న్యాయం కోరితే
ఎంతైనా మేలు మేలు
ధరణిలోన చాలు చాలు
కలహాలే వీడితే
కలవరమే మానితే
భూలోక స్వర్గమేను
కలసిమెలసి బ్రతికితే
చేయి చేయి కల్పితే
మనసు మనసు కలిస్తే
ఏదైనా సాధ్యమే
జీవితాన విజయమే



**గద్వాల సోమన్న**
,సెల్:9866414580

# హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకరణాలు అందజేత



**విజయవాడ పశ్చిమ జూన్ 9** :(వార్తా ప్రభ ప్రతినిధి)గత నాలుగు సంవత్సరాలుగా వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న హరివిల్లు ఫౌండేషన్ సంస్థ నేడు కొండపల్లిలోని శ్రీవిద్య మానసిక వికలాంగ మరియు అనాథ పిల్లల హోమ్ నందు అక్కడి పిల్లలకు నిత్యం ఉపయోగపడే రూ.35,000/-ల విలువైన వాషింగ్ మిషన్, బాల్ పూల్ మరియు స్నాక్స్ ఐటమ్స్ అందజేయడం జరిగింది. ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఎస్.కె.మొహమ్మద్ రఫీ మాట్లాడుతూ శ్రీవిద్య ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు నెల రోజుల క్రితం వారి హోమ్ లో ఉండే పిల్లలకు మీ ఫౌండేషన్ నుండి ఏదయినా సహాయము చేయమని అభ్యర్థించగా తమ సభ్యులలో కొంతమంది కలిసి ముందుగా ఆ హోమ్ లోని పిల్లల పరిస్థితిని స్వయంగా వెళ్లి చూసి వారికి అత్యవసరంగా ఏమి అవసరమో కనుక్కుని వెంటనే తమ ఫౌండేషన్ తరపున అక్కడి పిల్లలకు అవసరమయ్యే ఉపకరణాలు ఈరోజు అందజేయడం జరిగిందని తెలిపారు. ఫౌండేషన్ కోశాధికారి ఎం.రవి కుమార్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా గత నాలుగు సంవత్సరాలుగా వైద్యము, విద్య వంటి రంగాలలోనే కాక సామాజిక సేవాదృక్పదంతో వివిధ అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలలో వారికి అవసరమైన వస్తువులను, ఆహారాన్ని అందించడం కూడా తమ సేవలను అందజేయడం జరుగుతుందని, ఈరోజు ఇక్కడ మానసిక స్థితి సరిగా లేని పిల్లలకు, అనాథ పిల్లలకు చేసిన సేవ భగవంతుని సేవతో సమానంగా భావిస్తున్నామని తెలిపారు.అంతేకాక తమ ఫౌండేషన్ ఇప్పటివరకూఎవరి వద్దా విరాళాలు సేకరించడంలేదని, తమ సభ్యులు,సభ్యురాళ్లు స్వచ్ఛందంగా నెల నెలా తలాకొంత మొత్తం పోగు చేసుకుని ఇన్నాళ్లుగా ఇన్ని సేవాకార్యక్రమాలు చేస్తున్నామని, ఇటువంటి సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న సభ్యులకు, సభ్యురాళ్లకు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి అయిన డా. శరత్ కుమార్, సహాయ కార్యదర్శి యు.కనకారావు, కార్యవర్గ సభ్యులు ఎం.బాలసూర్యనారాయణ, శ్రీమతి.ఎం.శ్రీదేవి, అప్పలరాజు, కె.సుబ్రహ్మణ్యం, పి.లక్ష్మణరావు, పి.రామ్మోహన్, కె.శ్రీనివాస్ మరియు హోమ్ నిర్వాహకురాలు శ్రీమతి.బి.అమల తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ యాక్ట్ చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలి

**● వారిని వెంటనే అరెస్టు చేయాలి. ● రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసు నమోదు చేయాలి ● రాజధాని ప్రాంత మహిళ రైతులు అమరావతి రైతు జేఏసీ దళిత జేఏసీ నాయకుల డిమాండ్ ● రాజధాని ఉద్యమం కోసం మహిళలు నిద్రాహారాలు మాని పోరాటాలు చేశారు ● రాజధాని మహిళలపై చేసిన సంస్కారహీనమైన వ్యాఖ్యలకు జగన్మోహన్ రెడ్డి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే అమరావతి రాజధాని మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి ● కృష్ణంరాజు ● పిచ్చి పరాకాష్టకు చేరిందని మహిళలను దళితులను కించపరిచే ఫ్యూడలిస్ట్ వ్యక్తులను బహిష్కరించాలి ● అమరావతి రాజధాని పోరాటంలో ముందు నిలబడిన మహిళలను వేశ్యలు అంటూ కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి ● అమరావతి రాజధాని ప్రాంతంలో 80% పైగా దళిత ప్రజలు ఉన్నార- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి లిపాతర్లరమేష్ డిమాండ్**





**అమరావతి జూన్ 9** (వార్తాప్రభ ప్రతినిధి)అమరావతి మహిళలను సాక్షి లైవ్ డిబేట్ లో వేశ్యలు అంటూ సంబోధించిన ఎనలిస్ట్ కె కృష్ణమరాజు, కేఎస్ఆర్, సాక్షి మీడియా ద్వారా జగన్, వైసీపీ పేటీఎం బ్యాచ్ విష ప్రచారం చేస్తున్నారని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ సోమవారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్లో సిఐ వై శ్రీనివాసరావు, గ్రామీణ ఎస్ఐ మహేష్ కు ఫిర్యాదు చేశారు. అమరావతి లో ఈ సందర్భంగా పాతర్ల రమేష్ దళిత జేఏసీ నాయకులు వేమూరి మైనర్ బాబు, అమరావతి జేఏసీ నాయకురాలు ఆకుల జయ సత్య లు మాట్లాడుతూ అమరావతి దేవతల రాజధాని అని అలాంటి అమరావతిపై ఎనలిస్ట్ కృష్ణంరాజు , కొమ్మినేని శ్రీనివాసరావు లు ఇద్దరు సాక్షి మీడియా డిబేట్లో అమరావతి రాజధానిని వేశ్యల రాజధానిని సంబోధించడం ద్వారా వారి యొక్క వికృత చేష్టల ద్వారా అమరావతి రాజధాని ప్రాంత ప్రజల మనోభావాలు కించపరిచారని వారు అన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో 80 శాతం దళిత ప్రజలు ఉన్నారని, తాటికొండ నియోజకవర్గం ఎస్సీ నియోజకవర్గమని, మంగళగిరి నియోజకవర్గంలో ఎస్సీలు ఎస్టీ బీసీలు మైనార్టీలు ఉన్న నియోజకవర్గం అలాంటి నియోజకవర్గాలలో నివసిస్తున్న మహిళలను వేషాలని సంబోధించిన కృష్ణంరాజు కొమ్మినేని శ్రీనివాసరావులపై ఎస్సీ ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలని సాక్షి టీవీ యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేయాలని వారు కోరారు. అమరావతి రాజధాని కోసం భూములు ఇచ్చిన మహిళలను కించపరిచే విధంగా వేశ్యలు అనడం అవమానకరమని, రాజధాని మహిళలను అవమానించడం సరైన పద్ధతి కాదని డిబేట్లో అసభ్యకరంగా అలా మాట్లాడుతుంటే సాక్షి యాజమాన్యం ఖండించకపోవడం సరైన పద్ధతి కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణంరాజు పిచ్చి పరాకాష్టకు చేరిందని మహిళలను దళితులను కించపరిచే ఫ్యూడలిస్ట్ వ్యక్తులను బహిష్కరించాలన్నారు .బుద్ధిహీనులు రాజధాని మహిళలపై చేసిన సంస్కారహీనమైన వ్యాఖ్యలు కు ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డి బాధ్యుడని తప్పుకు నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని రాజధాని మహిళలని భేషరతుగా క్షమాపణలు వేడుకోవాలని వారు డిమాండ్ చేశారు. అమరావతి ఉద్యమంలో భూములు ఇచ్చిన రైతులు రైతు మహిళలు దళితులు బీసీ మైనార్టీ వర్గాల వారందరూ నిర్వహించిన పోరాటం ప్రపంచ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించి కలిగినదని పేర్కొన్నారు. అలాంటి పోరాటంలో ముందు నిలబడిన మహిళలను వేశ్యలుగా కించపరుస్తూ మాట్లాడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకొని వారిని అరెస్ట్ చేయాలని వారు అన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో అమరావతి దళిత జేఏసీ నాయకులు అమరావతి రైతు జేఏసీ నాయకులు, తోట సాంబయ్య, ఈపూరి పెద్దబ్బాయి, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, వడ్డేశ్వరపు ప్రసాదరావు, మేడూరి వరప్రసాద్ ఉప్పు వీరాంజనేయులు బొక్క నాగరాజు, ఎలమంచిలి పద్మజ ఆకుల ఉమామహేశ్వరరావు తదితరులు అందజేశారు.

# మీకోసం లో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలి.



**మచిలీపట్నం జూన్ 9** (వార్తాప్రభ ప్రతినిధి)ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో డిఆర్ఓ కే ఆర్ ఆర్ సి. ఎస్ డి సి శ్రీదేవి ఆర్డిఓ కే స్వాతిలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అ ప్రకారం కలెక్టరేట్లో 105 అర్జీలు అందాయి. వాటిలో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి.మొవ్వ మండలం చిన్న ముత్తేవి గ్రామానికి చెందిన అల్లంకి లక్ష్మీ నాంచారమ్మ మాట్లాడుతూ తనకు 377/3,4 లో 96 సెంట్లు మాగాని భూమి కలదని, సరిహద్దుదారుడైన చలమల శెట్టి వెంకట నాంచారయ్య కు 377/8లో 65 సెంట్ల అసైన్డ్ భూమి ఉందని, గత 15 సంవత్సరాలుగా అసైన్డ్ భూమిలో నుండి తన పొలంలోకి బండి మార్గం కలదని ప్రస్తుతం బండి దారిని నిరోధిస్తూ ఇబ్బంది పెడుతున్నారని తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.మచిలీపట్నం సర్కార్ తోట కు చెందిన అంకాని నాగూరు, ఎం రాజారావు, కే అప్పారావు తదితరులుకోతి బొమ్మ దగ్గర డ్రైనేజీ రోడ్డు మార్జిన్ మధ్యలో అక్రమంగా గుడిసెలు నిర్మించి ఆక్రమించడంతో మురికి శుభ్రంగా తీయడం లేదని తమ పిల్లలు తరచుగా అనారోగ్యానికి గురి అవుతున్నానని, ఆ గుడిసెలవారికి వేరొక చోట స్థలాలు ఇచ్చినప్పటికీ ఆ అక్రమ నిర్మాణాలు ఖాళీ చేయలేదని ఫిర్యాదు చేస్తూ అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకో వాలని కోరుతూ అర్జీ అందజేశారు.బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన పర్వతం వెంకటేశ్వరరావు తనకు రంగన్న గూడెం గ్రామంలో 17/2 సర్వే నెంబర్లు 3.75 సెంట్లు భూమి కలదని, అందులో పామాయిల్ పంటను వేసినప్పటి నుండి ఇప్పటివరకు రాయితీ నగదు బ్యాంక్ అకౌంట్ లో జమ కాలేదని ఆ రాయితీని మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల నుండి 23,714 అర్జీలు అందగా 21,889 అర్జీలు పరిష్కరించారని మిగిలిన 1825 అర్జీలు కూడా సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి ఇంజనీర్లు నటరాజు, లోకేష్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, డి ఆర్ డి ఏ పిడి హరిహరనాథ్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, ఉద్యాన అధికారి జ్యోతి, జిజిహెచ్ పర్యవేక్షకులు డా.ఆశాలత తదితర అధికారులు పాల్గొన్నారు.

## యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలి- ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట జూన్ 9** (వార్తప్రభ)జూన్ 21న ఇంటర్నేషనల్ యోగ డే సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో పురపాలక సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా ఆంధ్ర ర్యాలీలో ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని మున్సిపల్ ఆఫీస్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ. నేటితరం యువత ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకుని ప్రతిరోజు అభ్యసించాలన్నారు.యోగా ఒక ప్రాచీన భారతీయ సంపదని, దానిని తిరిగి మన జీవితం లోకి తీసుకురావడానికి, దేశ ప్రధాని ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యోగాంధ్ర అనే వినూత్న కార్యక్రమాన్ని రూపొందించి నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా యోగ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు యోగా పై అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నారన్నారు. మానసిక ఒత్తిడిని జయించాలన్న, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్న యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుండే యోగాను అభ్యసించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకట నరసింహారావు, కౌన్సిలర్స్ కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, ఇర్రి నరసింహారావు, గొట్టే నాగరాజు, కాటగాని నరసింహారావు మరియు మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి వెలంపల్లి దీవెనలు అందుకొన్న ఏ పి ఇండ్రస్టియల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ మాజీ చైర్పర్సన్ బండి పుణ్యశీల



**విజయవాడ పశ్చిమ జూన్ 9** :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ నగరంలో 34వ డివిజన్ కార్పొరేటర్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజి చైర్మన్ బండి పుణ్యశీల జన్మదినం సందర్బంగా సోమవారం బ్రాహ్మణ వీధిలోని పశ్చిమ వైసిపి కార్యాలయం నందు మాజి మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా మాజి మంత్రివర్యులు వెలంపల్లి శ్రీనివాసరావు బండి పుణ్యశీల ని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

## శ్రీ దిరి శాలమ్మ వారి ఆలయంలో వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు





**చెరుకుపల్లి మండలం జూన్ 9** :(వార్తా ప్రభ ప్రతినిధి) బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని నగరం మండలం పెద్దవరం గ్రామంలో శ్రీ దిరిశాలమ్మ అమ్మవారి పరివార ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవము అత్యంత వైభవోపేతంగా జరిగాయి .జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి ఆదివారం స్వాతి నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశం నందు 7 గంటల 48 నిమిషములకు ప్రతిష్టా మహోత్సవము అత్యంత వైభవపేతంగా జరిగింది.ఈ నెల 6 శుక్రవారం ఉదయం నుండి 8 ఆదివారం ఉదయం విఘ్నేశ్వర గవ్యాంతము పీఠ పూజ రత్నన్యాసము దాతన్యాసము యంత్రస్థాపన విగ్రహ స్థాపన కళావాహన మహాకుంభాభిషేకము, పూర్ణాహుతి దర్పణ దేన విప్ర కన్యాదర్శనము కూష్మాండబలి మహదాశీర్వచనము పండిత పూజలు జరిగాయి. తదనంతరము అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో యాగ్నికులు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆగమ ఎగ్జామినర్ సహస్రాధిక ప్రతిష్టాచార్య రుత్వికులు పొన్నపల్లి సత్యనారాయణ శర్మ, జొన్నలగడ్డ దివాకర శర్మ, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా చేప మందు పంపిణీ



**ఇబ్రహీంపట్నం, జూన్ 8 (వార్తా ప్రభ ప్రతినిధి):** మృగశిరకార్తె ప్రవేశం సందర్భంగా దగ్గు, ఆయాసం, పిల్లికూతలు ఉన్న ఆస్తమా రోగులకు కొండపల్లిలోని ఆరు పంపుల సెంటర్ లో ఆదివారం ఉచితంగా చేప మందును పంపిణీ చేశారు. గత 75 సంవత్సరాల పైబడి కొండపల్లిలో ఆస్తమా రోగులకు జనాబ్ హాజీ హకీ మహమ్మద్ యూసుఫ్ అలీ చేప ముందు పంపిణీ చేసేవారు. 1996లో ఆయన కాల ధర్మం చెందడంతో వారి జ్ఞాపకార్థం వారి మనుమలు మహమ్మద్ మసూద్ అలీ జిన్నా, మహమ్మద్ మహమూద్ అలీ లు ప్రతి సంవత్సరం మృగశిర కార్తె ప్రవేశం రోజున చేప మందుపంపిణీ చేస్తున్నారు.చేప మందును కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, తెలంగాణ లోని ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి అనేకమంది రోగులు వచ్చి చేప మందును వేయించుకున్నారు. చేప మందును వేయించుకున్నవారుజున్నుపాలు, వాలగచేప, బూడిద గుమ్మడికాయ, వంకాయ, గోంగూర వంటి వాటిని దీర్ఘకాలం వాడకూడదని తెలిపారు. చేప ముందు వేయించుకున్నవారు మూడుసార్లు క్రమం తప్పకుండా వేయించుకోవాలని తెలిపారు.

## యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ముప్పిడి నాగేశ్వరరెడ్డి,



**రెడ్డిగూడెం జూన్ 9** (వార్తాప్రభ ప్రతినిధి):11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్డిగూడెంలో జరిగిన యోగాంధ్ర ర్యాలీలో టీడీపీ రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.ర్యాలీలో ఆయన మాట్లాడుతూ“యోగం శరీర ఆరోగ్యానికి మాత్రమే కాదు, మనస్సుకు ప్రశాంతతనిచ్చే సాధన. రోజువారీ జీవనశైలిలో యోగా భాగంగా ఉంటే శారీరక సామర్థ్యం పెరిగే అవకాశం ఉంది.మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చు,” అని అన్నారు.పౌరులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ముఖ్యమైన మార్గమని పేర్కొన్న ఆయన, యువత దీనిపై ఆసక్తి చూపి ప్రతిరోజూ యోగా చేయాలనే పిలుపునిచ్చారు.ర్యాలీలో విద్యార్థులు, మహిళలు, యువత మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి - జిల్లా కలెక్టర్

**పదవతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ బహుకరణ**



**మచిలీపట్నం జూన్ 9 (వార్తాప్రభ ప్రతినిధి)**కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు శ్రమించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు ఉద్బోధించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి "షైనింగ్ స్టార్స్" పేరిట 201 మంది విద్యార్థులకు అవార్డులు అందించారు. ఈ అవార్డుల్లో భాగంగా, విద్యార్థులకు రూ.20 వేలు నగదు, ఒక మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు. పదవ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు, అలాగే ఇంటర్మీడియట్ లో 830 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంతో కష్టపడి మంచి మార్కులు సాధించారని అభినందించారు. ప్రపంచంలో ఎంతో మంది కృషి, పట్టుదలతో గొప్ప విజయాలను అందుకున్నారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. సైకిల్ ప్యూర్ అగరబత్తి నారాయణరావు, రిలయన్స్ కంపెనీ అధినేత ధీరుభాయ్ అంబానీ, ఆపిల్ కంపెనీ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్, శ్వేత విప్లవం పితామహుడు వర్గీస్ కురియన్ తదితర గొప్ప వ్యక్తుల విజయ గాథలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించి వారిలో స్ఫూర్తిని నింపారు. విద్యార్థి దశ నుంచి ఉద్యోగం సంపాదించే క్రమం వరకు విద్యార్థులు మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని, జ్ఞానాన్ని సంపాదించేందుకు మంచి పుస్తకాలు చదవాలని, మత్తు పదార్థాలతో చెడు అలవాట్లకు లోను కాకూడదని, పొరుగువారితో మంచి సంబంధాలు కలిగి ఉండాలని, అపజయాలను చాలెంజ్ గా తీసుకోవాలని, జీవితంలో హాస్యం కలిగి ఉండాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు పయనించేలా తగిన ప్రోత్సాహం అందించడమే ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశం అన్నారు. బాగా చదివే విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి నుంచి అత్యుత్తమ ఫలితాలను ఆశించవచ్చున్నారు. తొలినాళ్ళల్లో తాను పాఠశాల, కళాశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేసి తర్వాత పోలీసు శాఖకు ఐపీయస్ గా వచ్చానని జీవితంలో ఎదిగిన క్రమాన్ని ఆయన ఈ సందర్భంగా విద్యార్థులతో పంచుకున్నారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, విలువలపై ఒక మంచి పుస్తకాన్ని రాశారని, ఎలాంటి స్వలాభం ఆశించకుండా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమయ్యే ఆశావహులందరికీ ఆయన ఆ పుస్తకాన్ని ఉచితంగా అందించారని, అలాంటి వ్యక్తులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశించారు. జిల్లా పరిధిలోని కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై నేర ప్రవృత్తి వైపు యువత పయనించి జీవితాలను పాడు చేసుకుంటున్నారని, అలాంటి పరిస్థితుల వైపు విద్యార్థులు పోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువులు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రుల నిర్ణయాలే కాకుండా ప్రస్తుత ప్రపంచంలో ఉన్న అవకాశాలను బేరీజు వేసుకుని సొంత నిర్ణయాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు లేదా బంధువులు చెప్పారని సివిల్ సర్వెంట్లు, డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలని కాకుండా, విద్యార్థులకు ఉన్న ఆసక్తి మేరకు ఆయా రంగాలను ఎంచుకోవాలని, అందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమాజంలో ఉన్న అవకాశాలను అన్వేషించాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఆత్మవిశ్వాసం, ధైర్యం, రిస్కు తీసుకునేతత్వం వంటి అలవాట్లు ఎంతో అవసరమని సూచిస్తూ కుటుంబ, వ్యక్తిగత అభివృద్ధి లక్ష్యంగా మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జెడ్పీ ఆవరణలో ఏర్పాటు చేసిన కలల కుటీరం అనే స్టాల్ ను వారు సందర్శించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారో వారి స్వహస్తాలతో రాసిన లేఖలను ఆసక్తిగా చదివారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, ఆర్ ఐ ఓ సాల్మన్ రాజు, కూటమి నాయకులు బండి రామకృష్ణ, గురుమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు శాపంగా మారిన ఐపీఎల్ మ్యాచులు



**విజయవాడ పశ్చిమ జూన్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యువతకు శాపంగా మారిన ఐపీఎల్ మ్యాచ్లను వెంటనే రద్దు చేయాలి అఖిల భారత యువజన సమాఖ్య విజయవాడ అధ్యక్షు, కార్యదర్శి కంచర్ల భార్గవ్ లంకా గోవిందరాజులు డిమాండ్ .అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఐఏఎస్ కు ఐపీఎల్ మ్యాచ్లను నిర్వహించకూడదని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూమాట్లాడుతూ, ప్రతి ఏర్పాటు చేస్తున్న ఐపీఎల్ మ్యాచులు యువతకు శాపంగా మారుతున్నాయి, ఈ ఐపీఎల్ వల్ల బెట్టింగ్ లో బాధపడుతూ వాటి వల్ల ప్రాణాలపై తెచ్చుకుంటూ కుటుంబాలను వీధిలో పాలు చేస్తున్నారు అంతేకాకుండా వారి యొక్క ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు ఈ ఐపిఎల్ మ్యాచులు వారి యొక్క స్వార్థం కోసం బిజినెస్ ను పెంచుకోవడం సంపాదించుకోవడం తప్ప మరొకటి కాదు వీటిని నమ్ముకుని యువత వాటిపై పిచ్చితో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు ఈ ఐపీఎల్ లో జరుగుతున్న బెట్టింగులను వెంటనే అరికట్టాలని యువతకు ప్రభుత్వమే అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు యువతను ప్రాణాలను అరిస్తున్న ఇలాంటి మ్యాచ్లను వెంటనే రద్దు చేయాలని కోరారు ,మేము క్రీడలకు వ్యతిరేకం కాదు అని వారు తెలిపారు.ఏఐవైఎఫ్ బృందంగా వెళ్లినవారు. లంకా గోవిందరాజులు కంచర్ల భార్గవ్, లంకే సాయి, గంట మమత, షైనీ, స్వప్న పాల్గొన్నారు.

## తమకు జీతాలు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు వినతి పత్రం



**జగ్గయ్యపేట జూన్ 9 (వార్తప్రభ)**పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్( సి హెచ్ సి ) పాశుధ్య కార్మికులు సోమవారం శివాజీ విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు తాము 6 సంవత్సరాలుగా హాస్పిటల్ లో పారిశుద్ధ కార్మికులుగా పనిచేస్తున్నామని, తమకు సకాలంలో జీతాలు వచ్చినా రాకపోయినా అప్పులు చేసి మరి డ్యూటీలు చేస్తున్నామని, తాము ఆర్థికంగా వెనకబడిన పేద కుటుంబాలకు చెందిన వారమని, తమ కుటుంబ సభ్యులందరూ తమ యొక్క జీతం పైనే ఆధారపడి బతుకుతున్నామని మా కుటుంబంలో చాలా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని సకాలంలో జీతాలు వస్తే కానీ తమ యొక్క కుటుంబాలు గడిచే పరిస్థితి లేదని గత 3 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రస్తుతం జూన్ మాసంలో పాఠశాల ప్రారంభం అవుతున్నాయని మా పిల్లలకు పాఠశాల యూనిఫామ్, పుస్తకాలు కొనలేని పరిస్థితిలో తాము ఉన్నామని తమ కుటుంబాలు గడటం కష్టంగా ఉందని అప్పులు తెచ్చుకొని కుటుంబాలు గడుపుకుందామన్న బయట అప్పు దొరికే పరిస్థితి కూడా లేదని మాకు రావాల్సిన జీతాలు ఇప్పించాలని అనేకమార్లు ఇదే విషయాన్ని మా హాస్పటల్ సూపర్నెంట్, జిల్లా అధికారులకు ఎన్నోసార్లు చెప్పినప్పటికీ ఉపయోగం లేదని కాబట్టి మా యందు దయచేసి మాకు రావాల్సిన జీతాలు ఇప్పించడమే కాకుండా నెల నెల జీతాలు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ పారిశుధ్య కార్మికులు సిహెచ్ జయమ్మ, ఎం ఈరమ్మ, ఎస్ త్రివేణి, కె హేమలత, కె కృష్ణ, ఇ శాంతకుమారి పాల్గొన్నారు.

## విలువలు-వ్యక్తిత్వం మహా బాషా సొంతం

**- సంస్మరణ సభలో పలువురు వక్తలు**



**ఇబ్రహీంపట్నం, జూన్ 9 (వార్తా ప్రభ ప్రతినిధి):** మహోన్నత వ్యక్తిత్వం, మానవతా దృక్పథం మహాబాషా సొంతమని పలువురు వక్తలు కొనియాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, డాక్టర్ జాకీర్ హుస్సేన్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.మహాబాషా సంస్మరణ సభ కొండపల్లి క్రాంతి హై స్కూల్ లో సోమవారం నిర్వహించారు. మహాబాషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జనవిజ్ఞాన వేదిక ద్వారా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఆయన విస్తృత ప్రచారం చేశారన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. అక్షర కృష్ణ కార్యక్రమంలో రాత్రివేళ గ్రామాల్లో సైకిల్ పై తిరిగి అనేక మందికి వయోజన విద్య అందించారని తెలిపారు. అలాగే తెలుగు భాషా అభ్యుదయానికి ఆయన ఎనలేని కృషి చేశారని చెప్పారు. అభ్యుదయ భావాలు కలిగిన మహాబాషా అనేక కార్యక్రమాలతో అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలు సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి విఠపు బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోపాలం శివన్నారాయణ, డాక్టర్ మామిడి సీతారామారావు, వి.మురళీ మోహన్, కె.శ్రీనివాస్, పి.కామేశ్వరరావు, వి.శ్రీనివాస్, జాకీర్ హుస్సేన్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నజీఫ్ పాషా, అబ్దుల్ మతీన్, అబ్దుల్ ఖుద్దూస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాలయాలలో అధిక ఫీజులను అరికట్టాలి

**- సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు**



**జగ్గయ్యపేట జూన్ 9 (వార్తప్రభ)** మండల తహాశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సిపిఐ పట్టణ సమితి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణం, నియోజకవర్గ పరిధిలలో గల కార్పొరేట్,ప్రైవేటు పాఠశాలలు,కాలేజీలు ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం అయిందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఇదే అదునుగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాలయాల యజమానులు అందినకాడికి అధిక ఫీజులు వసూలు చేయడానికి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుండి యల్.కె.జి నుండి పీజి వరకు వెల రూపాయల నుండి లక్షలలో వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫీజులను నియంత్రించే ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం క్లాసుల వారీగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను ప్రతి ప్రైవేటు విద్యాసంస్థలలో కనబడేలా బోర్డులను ఏర్పాటు చేయాలి. బుక్స్ మీద వ్యాపారం చేస్తూ అధిక వసూలు చేస్తున్న విద్యా సంస్థల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనితో పాటు ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులు కట్టిన ఫీజులకు రశీదులను అందించాలన్నారు. తల్లికి వందనం డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేసే యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలి. అధిక ఫీజులు వసూలు నివారించడానికి టోల్ ఫ్రీ నెంబర్ ని ప్రతి ఒక్కరికి కనబడేలా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు, షేక్ కరీం,మెటికల శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

## కొండపల్లి మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం వైసీపీదే!

**మాజీ మంత్రి జోగి**



**ఇబ్రహీంపట్నం, జూన్ 8 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం వైసీపీదేనని ఈ విజయాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అంకితం ఇస్తున్నామని మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యానించారు. ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత మూడున్నరేళ్లుగా పాలకవర్గం, పరిపాలన లేక మున్సిపాలిటీ భ్రష్టు పట్టిందని ఆరోపించారు. ఓటమి భయంతో సీల్డ్ కవర్ లో ఫలితం ప్రకటించకముందే టీడీపీ కాడె కిందపడేసి పారిపోయిందని ఎద్దేవా చేశారు. ఇది ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చేతకానితనానికి నిదర్శనమన్నారు. కోర్టు ఆదేశాలను సైతం టీడీపీ నాయకులు అగౌరవ పరుస్తున్నారని విమర్శించారు. ఫ్యాను గుర్తుపై గెలిచి వెన్నుపోటు పొడిచిన వారిపై పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. పదవీ కాలం పూర్తయ్యాక ఎంపీపీ పదవి కూడా వైసీపీ ఖాతాలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి పిఆర్ఓ సత్యంబాబు జన్మదిన వేడుక



**రామచంద్ర పురం,జూన్ 9 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిఆర్ఓ బందిలి సత్యబాబు పుట్టినరోజు వేడుక ఘనంగా నిర్వహించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో మంత్రి సుభాష్ సత్యం బాబుచే కేక్ కట్ చేయించారు. అనంతరం పూలమాలలతో, దుస్సా లువాతో సత్కరించారు. అనతి కాలంలోనే రామచంద్రపురం నియోజవర్గం ప్రజలకు, మీడియాకు అత్యంత మిత్రులుగా, ఆప్తులుగా మంచితనంతో అందరి హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని మంత్రి సుభాష్ ప్రశంసించారు. మంత్రి సుభాష్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ బి.సత్యంబాబు కు, పలువురు అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచి ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని శు భాకాంక్షలు అందజేశారు . సీనియర్ జర్నలిస్టుగా, జర్నలిస్ట్ యూనియన్ నాయకుడి గా, జాతీయ వార్తా సంస్థల్లో పని చేసిన మా మిత్రుడు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని మేము కూడా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.



## పి ఫోర్ లో భాగస్వాములను గుర్తించాలి : యార్లగడ్డ



**గన్నవరం : జూన్ 9 (వార్తప్రభ)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి.ఫోర్ పథకంలో పారిశ్రామికవేత్తలు,ఎన్నారైలు, స్వచ్ఛంద సేవకులను భాగస్వాములు చేయడంతో పాటు ఈ పథకం పట్ల ఆసక్తిగలవారిని గుర్తించాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులకు సూచించారు. గన్నవరం ఎండివో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ను సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ గా ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సో అధికారులతో కలిసి యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం విజన్ యాక్షన్ ప్లాన్ పై అధికారులకు యార్లగడ్డ దిశా నిర్దేశం చేస్తూ జనవరి నియోజకవర్గంలో పి.4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులను గుర్తించడంతో పాటు బంగారు కుటుంబాలను, ఔత్సాహితులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సమాజంలో మార్పు తెచ్చేందుకు ఈ ఫోర్ పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు. పేదరికం నిర్మూలించేందుకు ఈ పథకం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ని అభివృద్ధి చేయడంలో చంద్రబాబును మించిన నాయకుడు లేడని ఎప్పటికైనా అభివృద్ధి పథకాలను ప్రారంభించిన ఆయన కొత్తగా ప్రవేశపెట్టిన ఈ పథకం విజయవంతం అవుతుందన్న నమ్మకాన్ని యార్లగడ్డ వ్యక్తం చేశారు. గన్నవరం నియోజకవర్గం లో పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూల వాతావరణ ఉందని, రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో పరిశ్రమ ఏర్పాటు అవుతాయని భరోసా ఇచ్చారు. అన్ని రంగాల్లో గన్నవరాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ వివరించారు. కూటమి నాయకులు, ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు కలిసికట్టుగా ముందుకు రావాలని ఈ సందర్భంగా వెంకట్రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు ఎండివోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అతి త్వరలో చైర్మన్ పదవి టీడీపీ కైవశం

**అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగి**

**- మీడియా సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు**

**ఇబ్రహీంపట్నం, జూన్ 9 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి పురపాలికలో పూర్తి మెజార్టీతో ఉన్న టీడీపీ వారం రోజుల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, వైస్ చైర్మన్ అభ్యర్థి చుట్టుకుదురు శ్రీనివాసరావు అన్నారు. కొండపల్లి టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందని ఆరోపించారు. మాజీ మంత్రి జోగి ఇంకా ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నట్లు ఫీల్ అవుతూ చైర్మన్ ను కూడా నిర్ణయం స్థితికి వచ్చారన్నారు. సీల్డ్ కవర్ లో ఏముందో తెలియకుండానే వైసీపీ నాయకులు గెలిచినట్లుగా ఊహించుకుని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అప్పుడు, ఇప్పుడు టీడీపీ మెజార్టీలో ఉందని చెప్పారు. సీల్డ్ కవర్ ఓపెన్ చేసి ఉంటే టీడీపీకి 16 వైసీపీకి 15 ఓట్లు వచ్చి ఉండేవన్నారు. చీటీలు, టాస్ లు వేయాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కోసం తాము కూడా ఎదురు చూస్తున్నామని, వాయిదా వేయించాల్సిన అవసరం టీడీపీకి లేదన్నారు. సాంకేతిక లోపం వల్ల అధికారులు వాయిదా వేశారు కానీ ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎమ్మెల్యే వసంత చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక పారదర్శకంగా జరిగేలా చూస్తున్నారని చెప్పారు. సమావేశంలో టిడిపి చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబు, కౌన్సిలర్ చనుమోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## జగన్ రెడ్డి భారతి రెడ్డి లు క్షమాపణ చెప్పాలి

**మంగళగిరి లో క్యాండిల్ ర్యాలీ.**




**అమరావతి జూన్ 9 (వార్తాప్రభ ప్రతినిధి)** ఏపీలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు కొమ్మినేని శ్రీనివాసరావు లను వెంటనే అరెస్ట్ చేయాలని, సాక్షి మీడియా టీవీ ఛానల్ పై చర్యలు తీసుకోవాలని టీవీ ఛానల్ యాజమాన్యమైన భారతిరెడ్డి జగన్మోహన్ రెడ్డిలు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు, మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు క్యాండిల్ లో నిరసన ర్యాలీ నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి, డౌన్ డౌన్ భారతి రెడ్డి డౌన్లోడ్, జగన్మోహన్ రెడ్డి లు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి అంటూ నినాదాలు చేశారు మహిళలను కించపరిచేలా మహిళల పట్ల జగన్ ఆయన మీడియా అ గౌర విధానానికి ఇదే నిదర్శనమని జగన్ సాక్షి మీడియా పై చర్యలు తీసుకోవాలని, అమరావతి మహిళలకు జగన్, భారతి రెడ్డి లు క్షమాపణ చెప్పాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్ చేశారు మంగళగిరి లో జరిగిన క్యాండిల్ ర్యాలీ లో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కోడూరి అఖిల్, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర సభ్యురాలు అమరావతి జేఏసీ నాయకురాలు శ్రీమతి కమ్మంపాటి శిరీష తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లూరు కిరణ్ జగదీష్ చిలక బసవయ్య మలవరపు వెంకట్ శ్రీమతి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు

# శ్రీ కనకదుర్గమ్మ ఆలయ భద్రతను కట్టుదిట్టం ఏర్పాట్లకు అవసరమైన చర్యలు

**శ్రీ కనకదుర్గమ్మ భక్తులకు అన్ని విభాగాల్లో ఇబ్బందులు లేకుండా సిబ్బంది విధులు నిర్వహించాలి**
**ఆలయ కార్యనిర్వహణాధికారి శీనానాయక్ ఆదేశాలు**





**విజయవాడ పశ్చిమ జూన్ 9 : (వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి పై శ్రీ కనకదుర్గమ్మ దర్శనానికి వస్తున్న భక్తుల ఇబ్బందుల నివారణపై ఆలయ కార్యనిర్వహణాధికారి వి కే శీనానాయక్ దృష్టి సారిస్తున్నారు.రాష్ట్రంలో రెండవ పెద్ద దేవస్థానమైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం భద్రత, భక్తులకు ఇబ్బంది కలిగించే చర్యలను అన్ని స్థాయిల సిబ్బంది అరికట్టాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ కోరారు. సోమవారం ఉదయం ఘాట్ రోడ్ లో పార్కింగ్ ప్రదేశం, పొంగలి తయారు షెడ్, బస్ షెల్టర్, ప్రోటోకాల్ ఆఫీస్ లను పరిశీలిస్తుండగా కొన్ని వాహనాలు ప్రోటోకాల్ ఆఫీస్ వరకు రావడం, ద్వి చక్ర వాహనాలు కుప్పలు తెప్పలుగా పార్క్ చేసి ఉండటం గమనించారు.ఎటువంటి భద్రతా తనికీలు లేకుండా ప్రధాన ఆలయానికి ఆమడ దూరంలో ఉన్న ప్రోటోకాల్ వరకు వాహనాలు అనుమతించడం అంటే ఆలయభద్రత పణంగా పెడుతున్నట్లే అని సిబ్బందిని వివరణ కోరారు. సమీపం వరకు వాహనాలు పంపమని విపరీతమైన వత్తిడి ఉంటుందని, ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతూ వివాదాలు జరుగుతున్నాయని ప్రోటోకాల్, సెక్యూరిటీ సిబ్బంది పేర్కొన్నారు.ఓం మలుపు తర్వాత పొంగలి షెడ్ దాటి వాహనాలు అనుమతించవద్దని, ఆలయభద్రత, భక్తులందరి సౌకర్యం దృష్టిలో ఉంచుకొని పొంగలి షెడ్ నుండి బ్యాటరీ వాహనాలు వీలైనన్ని ఎక్కువ ఏర్పాటు చేసి, ప్రోటోకాల్ పరధి లోకి వచ్చే వారిని ప్రోటోకాల్ ఆఫీస్ వరకు తీసుకు రావడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్ కుమార్, రవీంద్ర వార్లకు ఆదేశించారు.అవసరమైతే ప్రోటోకాల్ ఫేజ్ 1క్రింద ఓం మలుపులో సిబ్బంది స్క్రూటిని చేసి, ముందుకు పంపే విధంగా అమలు చేయాలని సూచించారు. తాను చూసిన ఏ ప్రధాన ఆలయం లోను ఇలా వాహనాలు గుడికి కేవలం అడుగుల దూరం లో రావడం లేదని, ఇక నుండి అయినా భద్రత రీత్యా అందరు సహకరించాలని శీనా నాయక్ కోరారు.కొంత సౌకర్యం కోసం అందరిని ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తన అధికార వాహనం కూడా ఈ పరధి అతిక్రమించకుండా చూడాలని, తానూ భక్తుల తర్వాతేనని, అమ్మవారి ముందు అందరం ఎంత తగ్గి ఉంటే అంత మేలు జరుగుతుందని కార్యాలయ వ్యక్తిగత సిబ్బందికి ఈవో సూచించారు.

## టీడీపీ సీనియర్ నాయకులు గంగవరపు ప్రభాకర్ సతీమణి ప్రభావతి కన్నుమూత

**పరామర్శించిన పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్**



**విజయవాడ పశ్చిమ జూన్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పశ్చిమ సీనియర్ టీడీపీ నేత గంగవరపు ప్రభాకర్ సతీమణి ప్రభావతి( 49 )కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాదులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి సోమవారం భవానిపురం లోని వారి నివాసానికి వెళ్లి గంగవరపు ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభావతి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. చిన్న కుమారుడు ఆస్ట్రేలియా నుంచి రావలసి ఉన్నందున అంత్యక్రియలను మంగళవారానికి వాయిదా వేశారు.కూటమి నేతలు యేదుపాటి రామయ్య, పత్తి నాగేశ్వరావు, పచ్చవ మల్లికార్జున బ్రహ్మారెడ్డి తదితరులు పరామర్శించారు...

## ప్రజలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశాలు**




**విజయవాడ పశ్చిమ జూన్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలకు శాశ్వతమైన పరిష్కారాలు చూపించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రధాన కార్యాలయం తో పాటు జోనల్ కార్యాలయాల్లో జరిగే ప్రజా ఫిర్యాదులను పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తూ మూడు కార్యాలయాల అధికారులతో గతవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పరిష్కరించిన దరఖాస్తులపై సమీక్షించారు. వారం లో ఒక రోజు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు సమయపాలన పాటించాలని, ప్రధాన కార్యాలయం తో పాటు జోనల్ కార్యాలయంలో అధికారులందరూ 10 గంటలకు హాజరు కావాలని అన్నారు. దరఖాస్తుదారులను వేచి ఉంచకుండా వెంటనే దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ సేవల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పురమిత్ర యాప్ లో స్వీకరించిన ఫిర్యాదులను, అధికారులు పరిష్కరించిన తీరును సమీక్షించారు. ఎప్పటికప్పుడు పురమిత్ర ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి ఫిర్యాదులో నాణ్యమైన, శాశ్వతమైన పరిష్కారం అందించాలని, ప్రజలకు పరిష్కారం చూపించాలే తప్ప వేరే శాఖపై సమస్యను మళ్లించకూడదని అధికారులను హెచ్చరించారు. శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని వచ్చిన ప్రతి ఫిర్యాదు శాఖల సమన్వయంతో పరిష్కరించాలని కమిషనర్ అన్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు తీసుకువచ్చిన ఫిర్యాదులను, శాఖధిపతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారులకు తమ స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని తీసుకొచ్చే విధంగా చూస్తామని తెలియపరిచారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 9, ఇంజనీరింగ్ 2 , రెవెన్యూ సంబంధించినవి 1, ఎస్టేట్ 1 , మొత్తం కలిపి 13 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్యకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించిన రెడ్డిగూడెం వైస్ ఎంపీపీ



**రెడ్డిగూడెం జూన్ 9 (వార్తాప్రభ ప్రతినిధి):**ెడ్డిగూడెం మండల వైస్ ఎంపీపీ,చాట్ల రాబర్టు సహకారంతో అభ్యుదయ యువశక్తి సంఘం వారి ఆధ్వర్యం లో,రెడ్డిగూడెం ఎస్సీ కాలనీలో వెల్నెస్ సెంటర్ నందు ఉచిత మెగా కంటి వైద్య శిబిరంను మండల వైస్ ఎంపీపీ శ్రీ చాట్ల రాబర్ట్ ప్రారంభించినారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కంటిపట్ల శ్రద్ధ వహించాలని లేకపోతే జీవితమే అంధకారం అవుతుందని, తెలియజేసినారు,ఈ శిబిరమందు కంటి వైద్యులు పల్లెపాం లక్ష్మీ కుమారి పాల్గొని 80 మందికి కళ్ళు పరీక్షించి ఉచితంగా మందులు అందజేసినారులి'కంటి పొరలు కంటి చుక్కలములు ఉన్న వారిని విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రినకు రిఫర్ చేయడమైనది, ఈ శిబిరంలో రెడ్డిగూడెం సొసైటీ మాజీ ప్రెసిడెంట్ గుడిసె ప్రభాకర్ రెడ్డి కులదీప్ రెడ్డి రామి రెడ్డి చాట్ల. ఆదాము అభ్యుదయ యువ శక్తి సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు చాట్ల రాజేష్ విస్సన్నపేట సిరి ఆప్టికల్స్ ప్రోప్రైటర్ వెంపటి సురేష్ తదితరులు పాల్గొన్నారు

## విజయవంతంగా నాలుగు రోజులపాటు నిర్వహించబడిన మసూల బీచ్ ఫెస్టివల్ - 2025

**మచిలీపట్నం జూన్ 9 (వార్తాప్రభ ప్రతినిధి)** జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించిన కృష్ణాజిల్లా పోలీస్ యంత్రాంగం.రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా ముఖ్య పట్టణమైన మచిలీపట్నం మంగినపూడి సాగర తీరాన అంగరంగ వైభవంగా నిర్వహించిన మసుల బీచ్ ఫెస్టివల్ - 2025 అత్యంత వైభవంగా విజయవంతంగా ఏ చిన్న అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా నిర్వహించబడింది. నాలుగు రోజులపాటు నిర్వహించబడిన ఈ మసుల బీచ్ ఫెస్టివల్ బందోబస్తు కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వీకరించి ఎక్కడికక్కడ బందోబస్తు పాయింట్లను ఏర్పాటుచేసి, ప్రతి పాయింట్ వద్ద నిర్నీత సిబ్బందిని ఏర్పాటు చేశారు. స్వయంగా ఎస్పీ స్వయంగా బందోబస్తు విధుల్లోకి దిగి మ్యాన్ ప్యాక్ తో ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడమే కాక వాహనాల మళ్లింపు చర్యలను చేపట్టి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూశారు. ప్రజల కు అసౌకర్యం కలగకుండా వాహనాలు నిలిచిన సమయంలో వారితో సరదాగా ముచ్చటించి వారి యొక్క సమాచారం తెలుసుకొని సరదాగా వారితో సమయం గడిపారు. జిల్లా అధికారి అనే స్థాయి భేదం లేకుండా సిబ్బందితో కలిసిపోయి విధుల్లో నిమగ్నమై సిబ్బంది యొక్క పని భక్తులను తగ్గించి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు. నాలుగు




రోజులపాటు జరిగిన ఈ బీచ్ ఫెస్టివల్ ను పకడ్బందీగా బందోబస్తు నిర్వహించి, సుదూర ప్రాంతాల నుండి ఈ వేడుకలకు విచ్చేసిన ప్రజలకు అసౌకర్యం కలగకుండా వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చూసినందుకు, జిల్లా ఎస్పీ, సిబ్బంది అందరికి ప్రతి ఒక్కరికి కరచాలనం అందించి అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తిని మునుముందు కొనసాగిస్తూ పటిష్ట బందోబస్తు మరెన్నో చేసే కృష్ణాజిల్లా పోలీస్ శాఖ యొక్క ప్రతిష్టను పెంపొందించాలని సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని నింపారు.

## యోగా చేయండి -మనశ్శాంతిగా ఉండండి



**మచిలీపట్నం జూన్ 9 (వార్తాప్రభ ప్రతినిధి)**యోగాతో మన ఆరోగ్యం కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు పేర్కొన్నారు. సోమవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీ టాకీస్ నుండి జడ్పీ సెంటర్ వరకు యోగా చేయండి-మనశ్శాంతిగా ఉండండి, చేద్దాంచేద్దాం -యోగా చేద్దాం వంటి నినాదాలతో రికార్డులు పట్టుకొని నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీ సెంటర్లో మానవహారం ఏర్పడి అందరి చేత యోగ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యోగ విశిష్టతను ప్రపంచానికి తెలియజేసి జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకునేలా చేశారన్నారు. ఆ ప్రకారంగాఈనెల 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పాటిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం ఆర్కే బీచ్ లో జరుగుతున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం లో ప్రధానమంత్రి మోడి 10 లక్షల మందితో కలసి ప్రపంచ రికార్డు దిశగా పాల్గొంటున్నారన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని ప్రతిరోజు అరగంటసేపు యోగ చేయడం వలన ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయన్నారు.ఎటువంటి ఖర్చు లేకుండా యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఓ సాల్మన్ రాజు, యోగా గురువు ముదిగొండ శాస్త్రి,నగరపాలక సంస్థ, ఆయుష్ శాఖ డాక్టర్లు, సిబ్బంది, ఇంటర్మీడియట్ విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో కాపు బలిజ సంఘం ఉభయంలో ఆకుపాటి కుటుంబ సభ్యుల మహా అన్నదాన కార్యక్రమం





**కనిగిరి జూన్ 9 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కాపు బలిజ సంఘం వారి ఉభయంలో ఉదయం 7 గంటలకు స్వామివారికి విశేష పూజలు, 8.30 నిమిషములకు మోహిని అవతారంలో స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా, భేతాళ నృత్య ప్రదర్శన, కనక తప్పెట్లు, నవ్వుల ప్రదర్శన, బాణసంచా, పండు ఈవెంట్స్, డిజె సౌండ్ సిస్టం లతో కాపు బలిజ సంఘం వారు నిర్వహించారు. దేవస్థానములో మధ్యాహ్నం ఆకు పాటి రమణయ్య, శ్రీమతి రాములమ్మ, ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ దంపతులు, ఆకుపాటి డాక్టర్ కిషోర్ దంపతుల సారథ్యంలో 5000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాపు బలిజ సంఘం నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు,గుత్తి వెంకటరాజా, వరి కూటి చిరంజీవి, శ్రీరామ్ శ్రీనివాసులు, కొండా నరసింహులు, గద్దె ఏడుకొండలు, బండ్ల నారాయణ, చలివేంద్రం సుబ్బారావు, నరసింగు సాంబశివరావు,పాలపర్తి వెంకటేశ్వర్లు, వాయినేని రాఘవ, నీరుకట్టు నాయబ్ రసూల్ తదితర కాపు బలిజ సంఘం వారు ఉభయం ఏర్పాట్లను ఆద్యాంతం పర్యవేక్షించారు.

## చారిత్రాత్మక పట్టణంలో శివాజీ విగ్రహ ఏర్పాటు సంతోషదాయకం

● మహనీయుల చరిత్ర నేటి తరాలకు తెలియజేయాలి ● ధర్మ రక్షణకు పోరాడిన యోధుల జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో ఉండాలి ● మంత్రి సత్య కుమార్ యాదవ్




**జగ్గయ్యపేట జూన్ 9 (వార్తప్రభ)** ధర్మ రక్షణ కోసం పోరాడిన మహనీయుల జీవిత చరిత్ర నేటి తరాలకు తెలియజేసే విధంగా జగ్గయ్యపేటలో చత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించుకోవటం సంతోషం గా ఉందని రాష్ట్ర వైద్య విద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.సోమవారం. పట్టణంలోని విజయవాడ రోడ్ లోని శివాజీ సర్కిల్లో శ్రీ చత్రపతి శివాజీ శ్రీ శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామి శ్రీశ్రీశ్రీ శివ స్వామి, ఆధ్యాత్మికవేత్త చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి లతో కలిసి చత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి సాంప్రదాయంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు . అనంతరం జిల్లా టిడిపి పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, జిల్లా కే డి సి సి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మాజీ రాష్ట్ర ప్రభుత్వ విప్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర లతో కలిసి మంత్రి సత్య కుమార్ యాదవ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక పట్టణంలో ఇటువంటి మహనీయుని విగ్రహం ఏర్పాటు చేసిన హిందూ చైతన్య వేదిక , విగ్రహ నిర్మాణ కమిటీ ప్రతినిధులు పిన్నం వెంగళరావు, నోముల రఘు,సంక భాస్కర్, పబ్బతి నరేంద్ర, అల్లి రవి చంద్ లను అభినందిస్తున్నట్లు తెలిపారు. ధర్మం కోసం పోరాడిన మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చి తెలియజేస్తే బాగుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు ఆనందదాయకం- ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య**

చత్రపతి శివాజీ మహా రాజ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకొని ఆవిష్కరించుకోవటం ఆనందదాయకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. విజయవాడ నుండి జగ్గయ్యపేట పట్టణానికి వచ్చే వారికి ముందుగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం దర్శించుకునేలా నిర్వహణ చేసిన విగ్రహ కమిటీ నిర్వాహకులను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.హిందూ ధర్మ రక్షకులు చత్రపతి శివాజీ-జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం హిందూ ధర్మ రక్షకులుగా పోరాటయోధుడిగా చత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రలో నిలిచిపోయారని అటువంటి మహనీయుని విగ్రహం ఏర్పాటు చేసుకొని ఆవిష్కరించుకోవడం జరిగిందని అన్నారు. దేశం కోసం, ధర్మం కోసం పాటుపడిన వారి ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.మహనీయుల జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాలి-జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను మహనీయుల జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాలని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు మాజీ రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. ఆధ్యాత్మిక పట్టణముగా 108 దేవాలయాలు కలిగిన జగ్గయ్యపేటలో చత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. టిటిడి కళ్యాణ మండపంలో మొట్టమొదటి కార్యక్రమంగా శివాజీ మహారాజ్ ఆవిష్కరణ సభ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచార భరత్ కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా , ధర్మ మార్గంలో జీవనం కొనసాగించే వారందరూ ధర్మం కోసం పోరాడిన యోధుల జీవిత గాధలను తమ పిల్లలకు తెలియజేస్తూ ఉండాలన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ ధర్మ మార్గంలో జీవించాలి- ఆధ్యాత్మికవేత్త చిట్టా లక్ష్మీ నరసింహ శాస్త్రి ప్రకృతిని ప్రేమిస్తూ ధర్మ మార్గంలో జీవించే వారికి దైవానుగ్రహం లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి అన్నారు.

**వేదాలు పుట్టిన భూమి భారత దేశం**
**పురాతన దేవాలయాలు కలిగిన పట్టణం జగ్గయ్యపేట- మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర**

వేదాలు పుట్టిన భూమి భారతదేశమని, పురాతన దేవాలయాలు కలిగిన ఆధ్యాత్మిక పట్టణం జగ్గయ్యపేట పట్టణం అని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. ఒక్కొక్క దేవాలయానికి ఒక్కొక్క విశిష్టత కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగావిగ్రహ నిర్మాణ కి అత్యధికంగా విరాళాన్ని అందించినజగ్ తాప్ విష్ణువర్ధన్ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార రాజా లను మంత్రి సత్య కుమార్ యాదవ్ నిర్వహణ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలసి సన్మానించి శివాజీ మహారాజు విగ్రహ ప్రతిమలు అందజేశారు.ఈ కార్యక్రమంలో యువనేత శ్రీరాం ధనుంజయ చినబాబు,బిజెపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మన్నే శ్రీనివాసరావు, శివాజీ మహారాజ్ అభిమానులు, పలు పార్టీల రాజకీయ నాయకులు, నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు ప్రముఖులు స్థానికులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు

## అనారోగ్య బాధితురాలు దుర్గా భవాని ని పరామర్శించిన బాజీ బాబా బృందం



**విజయవాడ పశ్చిమ జూన్ 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్ లో పశ్చిమ నియోజకవర్గ వైసిపిమహిళా అధ్యక్షురాలు దుర్గా భవాని అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు ఈ విషయం తెలిసిన రాష్ట్ర వైఎస్ఆర్సిపి మైనారిటీ కార్యదర్శి. బాజీ బాబా సోమవారం ఆమె స్వాగహంలో ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగాబాజీ బాబా మాట్లాడుతూ ఆ అల్లాహ్, కనకదుర్గమ్మ ఆశీస్సులతో దుర్గా భవానీ త్వరగా కోలుకోవాలని మరల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు. పశ్చిమ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు బత్తుల పాండు, యువజన నాయకుడు రాజారెడ్డి, కాపు నాయకుడు కర్రీ గౌరీ, బీసీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఎస్సీ నాయకులు ఏనుగుల సునీల్, మహిళా నాయకురాలు ఆర్కే రెడ్డి చిన్ని తదితర వైసిపి నాయకులు ఆమెను పరామర్శించారు

## విశ్వభారతి విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ అందజేత



**పెడన,జూన్ 9 (వార్తాప్రభ) :** పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్ లో 2024-2025 వ సంవత్సరం 10 వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచి ఇద్దరు విద్యార్థినిలు కేదారి శ్రీ లక్ష్మీ సుమ ఉమ్మిటి నాగ లలితకు ప్రతిభా అవార్డులను అందజేశారు. ప్రభుత్వం విద్యాశాఖ షైనింగ్ స్టార్స్ పేరు మీద ఇస్తున్న ప్రతిభా అవార్డులను వీరికి ప్రకటించిన సంగతి తెలిసిందే. మచిలీపట్నంలో జరిగిన జిల్లాస్థాయి కార్యక్రమము నందు 20 వేలు నగదు బహుమతి జ్ఞాపిక ప్రశంస పత్రములను జిల్లా కలెక్టరు డీకే బాలాజీ డీసీ ఎమ్ ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి జిల్లా విద్యాశాఖాధికారి రామారావు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర అవగాహన ర్యాలీ...



**పెనుగంచిప్రోలు, జూన్ 9 (వార్తాప్రభ) :** యోగాంధ్ర మహోత్సంలో భాగంగా పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి యోగాంధ్ర అవగాహన ర్యాలి సోమవారం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమానికి సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి ఎంపీడీఓ జి. శ్రీను, తహసీల్దార్ శాంతి లక్ష్మి ,హౌస్ యింగ్ ఏ ఈ. ఆర్,సతీష్ ,ఈఓ (పీఆ ర్అండ్ఆర్ డి)కె.సుబ్బారావు ,పంచాయతీ కార్యదర్శి జి.శ్యాం కుమార్, అంగన వాడి టీచర్లు ఆయుస్మాన్ డాక్టర్స్, కొల్లూరు వాణి, డాక్టర్, దుర్గమల్లేశ్వర్రావు, యోగ మెలకువలు గురించి తెలియజేసారు, మరియు యోగాంధ్ర గురించి అవగాహన ర్యాలీ జరపడమైనది ,

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం 1కోటి 15 లక్షలు





**పెనుగంచిప్రోలు,జూన్ 9 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు సోమవారం హుండీ లెక్కింపు జరిగినది.75రోజులకు గాను శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సాధారణ ఖాతా ద్వారా 1,15,34,525/- రాగా, మిశ్రమ బంగారం:-0.98 గ్రాములు,మిశ్రమ వెండి:-1.50 గ్రాములు వచ్చిందని ఆలయ ఈఓ కిశోర్ కుమార్, చైర్మన్ జంగాల, శ్రీనివాసరరావు, తెలిపారు.అలాగే విదేశీ కరెన్సీ యు ఎస్ ఓ :-51,కెనడా:-100,మలేషియా:-1,ఇంగ్లాండ్:-5,ఫౌండ్స్ థాయ్ బౌట్స్:-20 వచ్చినవని వారు ప్రకటన లో తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో డిప్యూటీ కమిషనర్ మరియు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి భూపతిరాజు వెంకట సత్య నాగ కిషోర్ కుమార్, జూపూడి గ్రూపు టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి బి. రవీంద్రబాబు, పాలకమండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), పాలకమండలి సభ్యులు,దేవస్థాన సిబ్బంది మరియు శ్రీ దుర్గ శివ సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సచివాలయం - 2 లో 10-30కీ కూడ తియ్యని తలుపులు - రైతులు పడిగాపులు



**పెనుగంచిప్రోలు,జూన్ 9 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం పరిధిలోని అనిగండ్లపాడు గ్రామ సచివాలయం-2లో సోమవారం ఉదయం 10:30 గంటలు అవుతున్న ఇంత వరకు సచివాలయం తలుపులు తెరు సుకోలేదని రైతన్నలు వాపోతున్నారు.సచివాలయంలో విత్తనాలు తీసుకునేందుకు రైతులు ఉదయం 10 గంటల నుండే పడిగాపులు కాస్తున్నారు. సచివాలయ అధికారులు విధులలో అలసత్వం చూపుతున్నారని స్థానికులు రైతు లు ఆరోపిస్తున్నారు.

# యోగ పై అవగాహన ర్యాలీ



**ఆగిరిపల్లి, జూన్ 9 (వార్తాప్రభ) :** ప్రధానమంత్రి & రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు యోగ దినోత్సవాల సందర్భంగా ఏలూరు జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగ పట్ల అవగాహన యోగా వల్ల కలిగే బెనిఫిష్, తదితర అంశాల పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎన్డీఏ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది ఎనర్జీస్ మీట్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతథులుగా ఎంపీడీవో పి. భార్గవి , ఎమ్మార్వో ఎంవియన్. ప్రసాద్ పాల్గొన్నారు.భారతదేశం సాధించినటువంటి పరిపాలన విజయాలు, దేశ రక్షణ, మహిళలకు చట్టపరంగా రిజర్వేషన్, ఇన్ఫ్రా స్ట్రక్చర్, మేక్ ఇన్ ఇండియా మేడ్ ఇన్ ఇండియా స్వచ్ఛభారత్, ఉచిత వ్యాక్సినేషన్ విధానము, కరోనా సమయంలో ఉచిత రేషన్ పంపిణీ విధానము తదితర అంశాల పట్ల ప్రజలకు అవగాహన ఏర్పరిచి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వము చేపడుతున్న పథకాలు ప్రజలకు చేరువుగా ఎప్పుడూ ఉంటున్నాయి. వాటి పట్ల అవగాహన పెంచుకునే విధంగా ఉంటున్నాయని ఆగిరిపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నక్కనబోయి వేణు వివరణ ఇచ్చారు. జూన్ 9వ తారీకు నుండి 15 వరకు మొక్కలు మరియు ఎమర్జెన్సీ విభాగము మరియు, ప్రపంచ పర్యావరణ దినోత్సవము జరపాలన్నారు.ఈ కార్యక్రమంలో..ఈదర గ్రామ సర్పంచ్ దొండపాటి ఏసు పాదం , ఆరేపల్లి శ్రీనివాసరావు మాదల సత్యకుమార్, నలజాల హరిబాబు వీరభతిన జోషి, ఖాదర్ భాష,పొన్నం కిరణ్ , ఏఎన్ఎం, ఆషా వర్కర్స్, సచివాలయం సిబ్బంది, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గన్నారు.

## 2025 3 13, 31, 72, 91, 95, 96 వంటి స్టేట్ ర్యాంకులతో ఆదిత్య జయకేతనం

**కాకినాడ,జూన్ 9 (వార్తాప్రభ) :** ఏపీ ఈఏపీ 2025 ఫలితాలలో ఆదిత్య విద్యార్థులు అత్యున్నత స్టేట్ ర్యాంకులు సాధించి ఆంధ్రప్రదేశ్ విద్యా రంగంలో ఆదిత్య శిక్షణా పటిమను,ఆధికృతను మరొక్కమారు నిర్ద్వంద్వంగా ఋజువుచేసారు. ఏపీఈఏపీ(ఇంజనీరింగ్)స్టేట్ ఫలితాలలో పి. ఆదిత్య అభిషేక్ 13 వ ర్యాంకు, జి.లోషిణి 72 వ ర్యాంకు, వై. శుభ శ్రీవల్లి ఆత్రేయి 91వ ర్యాంకు, జి. శ్రీరామ శశాంక్ 95వ ర్యాంకు, వై. వేదిక 96 2 . 5 121, 136, 156, 169, 170, 172, 177, 198 అత్యధిక ర్యాంకులను విద్యార్థులు సాధించారు. మరెన్నో అత్యుత్తమ, ఏపీ ఈఏపీ సెట్ (అగ్రికల్చర్) స్టేట్ ఫలితాలలో వి. సాయి భవ్య హర్షిణి 31వ ర్యాంకును సాధించారు. ఇంకా 112, 119, 152.... మరెన్నో అత్యుత్తమ, అత్యధిక ర్యాంకులను విద్యార్థులు సాధించారు. అత్యున్నత స్టేట్ ర్యాంకులు సాధించి, ఆదిత్య ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో అగ్రగామినని ఋజువు చేసుకొందని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అన్నారు. కాకినాడ జిల్లా ఏపీ మొదటి 10 ర్యాంకులను 'ఆదిత్య' విద్యార్థులే కైవసం చేసుకోని సరిక్రొత్త రికార్డును సృష్టించారు. విద్యార్థుల స్థాయిని బట్టి ప్రణాళికలు రూపొందించటం వల్లనే ఇలాంటి అద్భుత విజయాలను ఆదిత్య విద్యార్థులు సాధిస్తున్నారని ఆదిత్య విద్యా సంస్థల సెక్రటరీ ఎన్.కె. దీపక్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ ఎప్సెట్ 2025 లో 100 ర్యాంకులలోపు 6 మంది,500 ర్యాంకులలోపు 38 మంది,1000 ర్యాంకులలోపు 62 మంది. విద్యార్థులు అత్యుత్తమ స్టేట్ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల హాస్టల్ డైరక్టర్ ఎన్.లక్ష్మీ రాజ్యం, ఆదిత్య విద్యా సంస్థల డైరక్టర్ ఎన్.శృతి, డైరక్టర్ ఎన్. సుగుణ, ఐఐటి ప్రిన్సిపాల్ జె.మొయిన, కో-ఆర్డినేటర్ కె.లక్ష్మీ కుమార్, అకడమిక్ డైరక్టర్ ఎస్.వి.రాఘవరెడ్డి,ఎస్. పి.గంగిరెడ్డి, పి. సత్యనారాయణ రెడ్డి, ఐఐటి క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ ఎమ్. ఫణీంద్ర, ఆదిత్య నిర్వహణలో గల ఇతర కేంద్రాలలో గల కళాశాలల ప్రిన్సిపాల్స్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను,ఉత్తమ శిక్షణనందించిన అధ్యాపకవర్గాన్ని అభినందించారు.

## బలం బలగం ఉన్న విలువలు విశ్వసనీయత లేని రోజులు



**విస్సన్నపేట,జూన్ 9 (వార్తాప్రభ) :** సంపూర్ణ మెజార్టీ ఉన్న అవిశ్వాస తీర్మానం పెడితే తిరిగి అధికారాన్ని సాధిస్తుందో లేదో కచ్చితంగా చెప్పలేని రోజులవి అన్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటిది మీడియా రంగంలో ప్రస్ఫుటమైన సాక్ష్యాలు ఆడియో వీడియో ఆధారాలు లేకుండా ప్రత్యక్ష సాక్షులు లేకుండా ఎలాంటి వార్త అయిన ఎవరు ప్రచురించిన అది తప్పే అవుతుంది. మీడియా రంగంలో వైరి వర్గాలపై దుమ్మెత్తి పోయటం గ్లోబల్ ప్రచారం చేయటం వాస్తవ దూరంగా రాజకీయ నాయకులు నమ్మకంగా డిబేట్ల రూపంలో మాట్లాడటం అవే విషయాలు సంబంధిత దినపత్రికలలో ప్రత్యేక ఆర్టికల్స్ గా రావడం అనాదిగా జరుగుతూ ఉంది. ఎన్నికల సమయంలో మండల ప్రజా పరిషత్ మున్సిపాలిటీ కార్పొరేషన్ అసెంబ్లీ పార్లమెంట్ సంబంధిత ఎన్నికల సమయంలో ఓటర్ నాడీ రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులతో పాటు స్థానికంగా ఆనాడు ఆ సమయంలో కౌంట్ అవుతాయని తెలుస్తోంది. రంగం ఏదైనా చేయూత నిచ్చే వారు ఒకవైపు గోతులు తీసేవారు మరోవైపు సహజంగానే ఉంటూ ఉంటారు. స్వపక్షంలో విపక్షం వలె ఎన్నికల సమయంలో వేరే వర్గం ఓడిపోవాలని వైరి పార్టీ వారికి సాప క్రింద నిరుల మద్దతీస్తూ స్వపక్షం వారికి వ్యతిరేకంగా ఓటు బ్యాంకు చీల్చేవారు కూడా ఉండటం మనం చూస్తూనే ఉంటాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆనాటి రాజకీయ పార్టీ ల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ లు పెట్టేందుకు సౌలభ్యంగా ఉండేది. అదేవిధంగా ఎమ్మెల్యే పార్లమెంటు స్థాయిలో పర్యటనల సమయంలో పత్రికా సమావేశాలు ఉన్నాయి. మీడియా అంటే గౌరవం ఉండేది నేడు మండల స్థాయిలో సైతం గ్రామాల వారీగా ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయి అందరూ నాయకులు ఉన్నారు అనే సమగ్ర సమాచారం వారి వద్ద ఉన్న కొన్ని పార్టీలలో నేటికీ కూడా మీడియా సోదరులు తెలియకపోవటం కోసమేరుపుగా చెప్పుకోవచ్చు. కొన్నిచోట్ల గత ప్రభుత్వాలలో నూతన సంవత్సరం, సంక్రాంతి, ఉగాది, దసరా దీపావళి రంజాన్ క్రిస్టమస్ పండగలు పబ్బాలకు విషెస్ చెప్పే నాయకులు అందించే తీపి మిఠాయిలు సైతం నియోజకవర్గం కేంద్రంలోని వారికే ప్రసాదాల అడ్డుకోవడం మండలాల రిపోర్టర్లకు మొండి చేయి చూపడం జరుగుతుంది. సభలు సమావేశాలలో కార్యక్రమానికి ముందు అగ్ర తాంబూలం ఇస్తున్న కొన్ని పార్టీలు సమావేశానంతరం పట్టించుకోని వారు కూడా ఉన్నారు అని అంటే అతిశయోక్తి లేదని చెప్పాలి. ఏది ఏమైనా మీడియా రంగాన్ని మంచి రోజులు రావాలని కోరుకుందాం.

## ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో పౌరాణిక నాటక ప్రదర్శనలు





**చల్లపల్లి : అవనిగడ్డ,జూన్ 9 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో జానపద, పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు ముమ్మనేని నాని.. మల్లీశ్వరి దంపతులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రదర్శనలు ప్రారంభించారు. తొలుత కోలాట ప్రదర్శన, కూచిపూడి నాట్యప్రదర్శన, ప్రముఖ రంగస్థల కళాకారుడు, సినీ.. స్టేజీ.. టివి ఆర్టిస్టు బోలెం రామారావు దుర్యోధనుడిగా దుర్యోధన మయసభ ప్రదర్శన ఆకట్టుకుంది. రామభక్త హనుమాన్ నాటకం నుంచీ ఆంజనేయుని యుద్ధసీను ప్రదర్శన జరుగ్గా, ఆంజనేయునిగా సినీ, టివి, స్టేజి ఆర్టిస్టు పస్తుల విజయకుమార్, గరుత్మండునిగా బొడ్డు రంగారావులు అద్భుతంగా ప్రదర్శించారు.అనంతరం విజయకుమార్ అభినయించిన సత్యహరిశ్చంద్ర నాటకం నుండి వారణాసి, కాటి సీను నాటికి ప్రియులను తన్మయత్వంలో ముంచెత్తింది. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి,రావెళ్ళ కృష్ణ ఫౌండేషన్ అధ్యక్షులు రావెళ్ళ ఉదయ్ కుమార్,ప్రముకులు సజ్జా చలపతిరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, యాసం చిట్టిబాబు, ఆకుల స్వభూప్రసాద్, గుడివాక శివరావు, వేమూరి రత్నగిరిరావు, అడపా రాంబాబు, షేక్ నబీఖోర్, కైతేపల్లి దాస్, బుల్లా కిషోర్ తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సన్మానించారు. కళాపరిషత్ ప్రతినిధులు ముమ్మనేని నాని, దాసి సీతారామరాజు, బోలెం నాగమణి, ఉప్పాల సాంబశివరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించి కళాకారులను సత్కరించారు.

## డా.బి.ఆర్ అంబేద్కర్ అనుస్మృతి పుస్తకావిష్కరణ



**మైలవరం,జూన్ 9 (వార్తాప్రభ) :** విజయవాడ స్వరాజ్ మైదానం స్మృతి వనంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాదముల చెంత మంగళవారం 'తెలుగు సాహిత్యంలో అంబేద్కర్ అనుస్మృతి'అనే ప్రత్యేక వ్యాస సంకలనాన్ని ప్రముఖ విద్యావేత్తలు ఆవిష్కరించా రు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేయబడిన 25 మంది ప్రత్యేక అధ్యాపక బృందంచే ఈ వ్యాస సంకలనాన్ని రూపొందించడం జరిగిందని సంపాదకుడు డా.మెండా దేవానంద్ కుమార్ తెలిపారు.డాక్టర్ లకిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇల్లా రవి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ఎంతో మహోన్నతమైనవన్నారు. తాను 'డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు మహాత్మా గాంధీ సామాజిక దృక్పథాలు' అనే వ్యాసం రాయటం గొప్ప ఆనందాన్ని కలిగించిందన్నారు. బడుగు బలహీన వర్గాల గొంతుకై అంబేద్కర్ నిలబడిన తీరు అమోఘం అన్నారు.అదేవిధంగా ఈ ప్రత్యేక సంకలనాన్ని తీసుకురావడానికి ఎంతో శ్రమించిన కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ దేవానంద్ కుమార్ కి అభినందనలు తెలియజేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య కొండపల్లి సుదర్శన్ రాజు మాట్లాడుతూ సరైన సమయంలో సరైన వ్యాస సంకల్పం అన్నారు. ఇందులో అంబేద్కర్ తాత్వికతను వివిధ కోణాల్లో అధ్యాపక మిత్రులు వ్యాసాల రూపంలో సమర్పించడం ఆనందదాయకం అన్నారు.ఈ వ్యాస సంకలనములో తొలి తరం దళిత కవులను స్మరించి వారి రచనలు గూర్చి రచన వ్యాసంగాలు చేయడం నిజంగా అద్భుతం అన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన భావ వీణ గౌరవ సంపాదకులు డాక్టర్ పి. నాగయ్య మాట్లాడుతూ మా మాస పత్రిక ద్వారా ఈ వ్యాస సంకలనం తీసుకురావడం చాలా సంతోషం అన్నారు. అదేవిధంగా సంపాదకునికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సంపాదకుడు డాక్టర్ మెండా దేవనంద్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆంధ్రప్రదేశ్ పర్యటన మొదలు నేటి వరకు జరిగిన దళిత సాహిత్యాన్ని ఈ సంకలనం తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు.అధ్యాపక పరిశోధక మిత్రులు తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి ఇంత మంచి గ్రంథం తీసుకురావడానికి కారకులైనందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖ రంగస్థలం నటులు డా.ఎస్. వెంకటేశ్వరరావు ఇతర ప్రముఖులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఆక్స్ ఫర్డ్ హై స్కూల్ విద్యార్థినులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్







**జి.కొండూరు,జూన్ 9 (వార్తాప్రభ) :** స్థానిక ఆక్స్ ఫర్డ్ హై స్కూల్ విద్యార్థినులు బి.నిఖిల, ఎం.షాలిని షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ అందుకున్నారు.పదవ తరగతి,ఇంటర్ మీడియేట్ - 2025 పరీక్ష ఫలితాలలో అసాధారణ ప్రతిభ కనపరచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమం సోమవారం విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ చేతులు మీదుగా ప్రశంసాపత్రంతో పాటు మెడల్, రూ. 20 వేల విలువగల చెక్ విద్యార్థినులు అందుకున్నారు.షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ అందుకున్న బి.నిఖిల, ఎం.షాలిని లను పాఠశాల మేనేజ్మెంట్, ప్రిన్సిపల్ పాఠశాల సిబ్బంది అభినందించారు.

## వరి విత్తనాల పంపిణీ ప్రారంభం



**పెడన,జూన్ 9 (వార్తాప్రభ) :** నియోజకవర్గం లోని పెడన మండలం పెనుమల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రం లో సోమవారం నాడు వరి విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంబించారు.ఈ సీజన్ కు బీపీటీ 1224 1318 రకాలము ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు అర్జా వెంకట నగేష్ శీరం ప్రసాద్ సమ్మెట శివరామ్ ప్రసాద్ ఏఈవో శిరీష రైతులు పాల్గొన్నారు.

## అన్నదానం కు 10 వేల 116/ రూ. విరాళం



**పెనుగంచిప్రోలు, జూన్ 9 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కు తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం నగర్ ద్వారకా నగర్ వాస్తవ్యులు నామా శరత్ బాబు వసుధ దంపతులు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం అన్నదాన పథకమునకు 10,116 రూపాయలు విరాళముగా ఆలయ కార్యనిర్వహణ అధికారి మరియు డిప్యూటీ కమిషనర్ బి హెచ్ వి ఎస్ ఎన్ కిషోర్ కుమార్ కి అందజేశారు.వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేయడమైనది .

## ప్రధాన రహదారిపై బైక్ ప్రమాదం



**తిరువూరు,జూన్ 9 (వార్తాప్రభ) :** తిరువూరు స్థానిక పట్టణ ప్రధాన రహదారిపై శ్రీనివాసా థియేటర్ సెంటర్ ఎల్ ఐ సి కార్యాలయం ముందు ముగ్గురు యువకులు బుల్లెట్ వాహనంపై వేగంగా వెళ్తు రోడ్డు దాటుతున్న వృద్ధుడిని తప్పించపోయి డివైడర్ కు తగిలి కిందపడగా బైక్ నడుపుతున్న యువకుడు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో వుండగా స్థానికులు ప్రైవేటు హాస్పిటల్ కు తరలించారు...

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188